తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## సింహవాహనంపై ఊరేగిన
# శ్రీసీతా సమేత కోదండరాముడు

తవణంపల్లె, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: మండలంలోని అరగొండ శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీసీతా సమేతుడైన కోదండరాముడు సింహవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఆదివారం శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా ప్రాంరంబమయ్యాయి. ఈకార్యక్రమానికి అరగొండ, పైమాఘంకు చెందిన గాండ్ల కులస్థులు ఉభయదారులుగా వ్యవహరించి ఉదయం వరుస ఉభయం తీసుకు వచ్చారు. ఈసందర్భంగా ఆలయంలో అర్చకులు ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి,అలంకరించి ప్రత్యేకపూజలు చేసి దూప దీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం సింహవాహనపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వుంచి గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రతి సమస్యకు పక్కాగా పరిష్కారం

**- అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం**



చిత్తూరు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ప్రతి సమస్యను పక్కాగా పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమూర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, డిప్యుటీ కలెక్టర్లు అనుపమ, విజయలక్ష్మీలు హాజరై ప్రజల నుండి అర్జీలు సమస్యలపై అర్జీలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల సమస్యలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి విధులు నిర్వర్తించాలన్నారు. ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని, ప్రతి అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందని, ప్రజల నుండి అందిన ప్రతి అర్జీని త్వరితంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ప్రతి అర్జీపై ప్రతి వారం సమీక్షించడం జరుగుతుందన్నారు. అర్జీలు రీ-ఓపెన్ అయితే వాటికి గల కారణాలను వివరించాల్సి వుంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 343 అర్జీలు కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల వున్న ప్రజల నుండి సమస్యలపై 343 అర్జీలు అందాయి. ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించి వాటిని క్షేత్ర స్థాయిలో సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా 296 అర్జీలు అందాయి. అలాగే పోలీసు శాఖకు సంబంధించి 10, డిఆర్‌డిఎ 22, పంచాయతీరాజ్ 4, దేవాదాయశాఖ 1, జిల్లా పౌర సరఫరాల అధికారి 4, చిత్తూరు మున్సిపాల్టీ 2, విద్యుత్‌శాఖ 2 అర్జీలు అందాయి.

## వెంకన్న ఆస్తులు కాపాడటంపై
# "ఫోకస్"!

**దేశవ్యాప్తంగా తిరుమలేశుని ఆస్తులు కబ్జా కాకుండా యాక్షన్‌ప్లాన్**




ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల: వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి భక్తులు,దాతలు పలు రకాలుగా బహుమానంగా ఇచ్చిన ఆస్తులను కాపాడటంపై తిరుమల తిరుపతి దేవస్థానం ఫోకస్ పెట్టింది. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఏడు కొండల స్వామి ప్రియభక్తులు సమర్పించుకున్న కానుకల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా, కబ్జాకు గురికాకుండా చూడాలనే యాక్షన్ ప్లాన్ అమలుచేసే దిశగా రాష్ట్రప్రభుత్వం కూడా చొరవతీసు కుంటోంది. ఇందుకోసం టిటిడి అధికారులు, పాలకమండలి సభ్యులతో ఒకమిటీని కూడా ఏర్పాటుచేశారు. గతనెలలో తిరుమలకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుస్వయంగా వేంకటేశ్వరస్వామి ఆస్తులు కబ్జా కానివ్వనని,రక్షణకు చర్యలు తీసుకుంటున్నామంటూ పునరుద్ఘాటించారు. ఎక్కడైనా దేవుని ఆస్తులు కబ్జా చేసివున్నా తిరిగి కాపాడుకోవడానికి కంకణంకట్టుకున్నామని వెల్లడించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో బుధవారం(నేడు) ఉండవల్లిలోని సిఎం నివాసంలో టిటిడి ఛైర్మన్ బొల్లినేని రాజగోపాల్ నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, రెవెన్యూ అధికారులు కలసి కీలక సమావేశం కానున్నారు. ముఖ్యంగా దేవుని ఆస్తుల పరిరక్షణకు యాక్షన్‌ప్లాన్, భక్తులకు మరింత సులభంగా స్వామివారి దర్శనం చేయించడం, అలిపిరి టోల్‌గేట్‌లో తనిఖీలకు అత్యాధునిక యంత్రాలు ఏర్పాటు ,అన్యమత ఉద్యోగులపై చర్యలకు కీలక సూచనలు తీసుకోనే దిశగా చర్చ సాగించనున్నారు. దేశవ్యాప్తంగా వెయ్యికిపైగా స్థిరాస్థులు ఉన్నాయని, 7,126.85 వేల ఎకరాలు ఉండగా ఇందులో ఆంధ్ర ప్రదేశ్‌లో 690 ఆస్తులు ఉన్నాయి. 6,657.43 ఎకరాలు ఉండటం విశేషం. సాక్షాత్తు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుపతి నగరం పరిసరాల్లోనే వివిధ చోట్ల 3,663 ఎకరాలు భూములు ఉన్నాయి. 584 ఎకరాలు స్థలాలపై వివిధ న్యాయస్థానాల్లో కేసులు నడుస్తున్నాయి. పలు కోర్టుల్లో ఉన్న కేసులు కూడా పరిష్కారానికి చొరవ తీసుకునేదిశగా ప్రస్తుత పాలకమండలి ముందడుగు వేయనుంది. దేశంలోని అనేక రాష్ట్రాల్లో భక్తులు తమ కానుకగా, దేవునిపై భక్తివిశ్వాసాలతో స్థిరాస్థులు, భూములు ఇనాంగా రాసిచ్చారు. ఈ ఆస్తులను ఎవరూ కూడా విక్రయించడానికి వీలులేకుండా గత పాలకమండలి తీర్మానం చేసి, ప్రత్యేక జిఒ కూడా జారీచేసింది.

**-సిఎం సమక్షంలో యాక్షన్‌ప్లాన్ :**

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి దేశవ్యాప్తంగా ఉన్న వేలకోట్లరూపాయలు విలువైన ఆస్తుల రక్షణ దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం గట్టి చర్యలు చేపట్టేందుకు యాక్షన్‌ప్లాన్ సిద్ధమవుతోంది. ఇందుకు అవసరమైన కార్యాచరణను రూపొంది స్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న వెంకన్న ఆస్తులను పూర్తిస్థాయిలో గుర్తించి ఎక్కడా అన్యాక్రాంతం కాకుండా చూడాలని, ఇప్పటికే పలువురు చేతిలో ఉన్న వాటిని వెనక్కుతీసుకుని పరిరక్షించాలని ఆలోచన చేస్తున్నారు. చిత్తూరుజిల్లాలో తిరుపతి,రూరల్ పరిసరాల్లో, చంద్రగిరి, తొండమనాడు, నాగలాపురం ప్రాంతాలతోబాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, కర్నాటక, ఒరిస్సా, ఢిల్లీ వంటి ప్రధాన నగరాల్లో శ్రీవారికి ఆస్తులు ఉన్నాయి. ఆస్తులన్నీటినీ గుర్తించి అన్యాక్రాంతం కాకుండా చూసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నారు.

ఈ కమిటీ పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి దేశవ్యాప్తంగా వెంకన్న భక్తులు స్వామివారికి కానుకలుగా సమర్పించిన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టేదిశగా ఛైర్మన్ ,అధికారులు అధ్యయనం చేస్తారు. దేశంలోని పలుప్రాంతాల్లో జనక్‌పురి, రిషికేష్, డెహ్రాడూన్ తదితర దూర ప్రాంతాల్లో ఉన్న ఆస్తులను ఆక్రమణలకు గురికాకుండా టిటిడి చూసే వీలుకలుగుతుంది. అంతేగాక దేశవ్యాప్తంగా ఉన్న వెంకన్న ఆస్తులను పూర్తిస్థాయిలో పరిరక్షించేందుకు ,రక్షణచర్యలు తీసుకోవడానికి అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఇప్పుడు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో టిటిడికి చెందిన ఆక్రమణలకు గురైన స్థలాలను పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకునే దిశగా పటిష్టచర్యలు తీసుకోనున్నారు.

# కలెక్టరేట్‌కు పెరుగుతున్న అర్జీదారులు



తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : ప్రతి సోమవారం వచ్చిందంటే తిరుపతి జిల్లా కలెక్టరేట్‌కు అర్జీదారులు, ఫిర్యాదుదారులు, బాధితులతో నిండి పోయి కలెక్టరేట్ కళకళలాడుతోంది. బాధితులు అర్జీలు చేతపట్టుకుని చిన్నాపెద్దా తేడా లేకుండా గుంపులు, గుంపులుగా వస్తున్నారు. దీంతో కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారుల సంఖ్య పెరుగుతూనే వస్తోంది. ఒకసారి వచ్చిన అర్జీదారుడు తిరిగి నాలుగైదు పర్యాయాలు కలెక్టరేట్‌కు రావడం జరుగుతోంది. గ్రామ, మండల, డివిజన్ స్థాయిలోనే సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను పరిష్కరించే అవకాశం ఉన్నా వాటిపై అధికారులు దృష్టి పెట్టక పోవడం, క్రింది స్థాయి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యపు సమాధానాలు చెప్పడంతో, సమస్యలు పరిష్కారం కాక కలెక్టరేట్‌కు అర్జీదారులు బారులు తీరుతున్నారని చెప్పక తప్పదు. ఒకానొక దశలో కలెక్టర్,జేసీ, డెప్యూటీ కలెక్టర్లు ఇచ్చే అర్జీలు పరిష్కారం అవుతున్నాయో తప్ప గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో అర్జీదారుల సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం కావడం లేదని బాధితులు వాపోతున్నారు. కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారుల సమస్యలను సంబంధిత క్రింది స్థాయి జిల్లా అధికారులు, గ్రామ, మండల, డివిజన్ అధికారులు, సిబ్బందికి రెఫర్ చేయడంతో సరిపెట్టక, స్వయంగా కలెక్టర్,జేసీ, డెప్యూటీ కలెక్టర్లు పీజీఆర్ఎస్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టడంతో పాటు నిర్లక్ష్యం వహించే క్రింది స్థాయి అధికారులపై తగు చర్యలు తీసుకుంటే కలెక్టరేట్‌కు వచ్చే అర్జీ దారుల సంఖ్య తగ్గే అవకాశం ఉందని బాధితుల నుంచి వినిపిస్తున్న వ్యాఖలు. ఆ దిశగా కలెక్టర్ స్పందిస్తారని ఆశిద్దాం.

# బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం

**- మున్సిపాలిటీలో టీడీఆర్ బాండ్ల కుంభకోణం**
**- తుడా ప్లానింగ్‌ను తుంగలోతొక్కిన గత వైసీపీ ప్రభుత్వం**

**శాప్ ఛైర్మన్ రవినాయుడు, నరసింహ యాదవ్, ఆర్‌సి మునికృష్ణలు**



తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త తిరుపతి మున్సిపాలిటీలో గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పేరుతో అవినీతికి పాల్పడిన టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు డిమాండ్ చేశారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన టీడీఆర్ మేళా స్పెషల్ డ్రైవ్‌ను తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జి.నర్సింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణతో కలిసి పరిశీలించారు. మేళాకు పెద్ద ఎత్తున వచ్చిన బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. పట్టణ అభివృద్ధి పనులు, విస్తరణ పనుల్లో భాగంగా అర్హులకు అన్యాయం చేసి బినామీలకు లబ్ధి చేకూరేలా వైసీపీ నేతలు చేసిన అవకతవకలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్ మౌర్యారెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌తో శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ అప్పటి మాజీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ మేయర్‌లు భూమన కరుణాకర్‌రెడ్డి, అభినయ్‌రెడ్డిల ప్రోద్భలంతో వారి బినామీలకు లబ్ధి చేకూరే విధంగా ఆనాడు ప్రభుత్వం పనిచేసిందని, దాని కారణంగా అర్హులు తీవ్రంగా నష్టపోయారన్నారు. తుడా మాస్టర్ ప్లాన్‌ను అనుసరించకుండా దానికి విరుద్ధంగా వైసీపీ నేతలు ఈ అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. దానికి మున్సిపల్ సిబ్బంది కూడా సహకరించడంతో రాష్ట్రంలోనే అతిపెద్ద టీడీఆర్ స్కామ్ తిరుపతిలో జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పులిగోరు మురళీకృష్ణారెడ్డి, శ్రీధర్ వర్మ, మహేష్ యాదవ్, తెలుగుయువత నాయకులు తోట వాసుదేవ, హేమంత్‌రాయల్, గోపీ, రంజిత్, మధు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో
# శాస్త్రోక్తంగా పెదకొటాయ్ ఉత్సవం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం పెద్ద కోటాయ్ ఉత్సవం ప్రారంభం అయ్యింది. ఆదివారం సాయంత్రం ఆలయంలోని అలంకారమండపం వద్ద స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను చక్కగా రాజేష్ గురుకుల్,సూరి గురుకుల్ అలంకరించారు. వేసవి కాలంలో చిన్న కోటాయ్ ఉత్సవాలను పది రోజుల పాటు జరిగే ఉత్సవాలను పెద్ద కోటాయ్ ఉత్సవం సందర్భంగా అలంకార మండపాన్ని చక్కగా మామిడి తోరణాలతో, అరటి చెట్లతో ముస్తాబు చేసారు.ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వేద మంత్రాలను పఠిస్తుండగా,ఆలయ అర్చకులు కరుణాకర్ గురుకుల్ ప్రత్యేక పూజలు జరిపారు. తరువాత స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను ఊరేగింపుగా ఆవరణలోని పొగడ చెట్టు కిందకు తెచ్చారు. కాగా ఇక్కడ చక్కగా వట్టివేళ్ళ పరదాలు ఏర్పాటు చేసారు.స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు షోడషాభిషేకాలు జరిపారు. ఆలయ అర్చకులు చక్కగా అలంకరించి పూజలు,నైవేద్యాలు అందించారు. తరువాత ఊరేగింపు జరిపారు.

# జిల్లా తెలుగుదేశం సారథి ఎవరు!

**- నెలాఖరులోపు గ్రామ, వార్డు, డివిజన్ కమిటీలతో పాటు మండల కమిటీలు ఏర్పాటు**
**- ఆపై జిల్లా అధ్యక్షుడి ఎన్నిక**
**- కడపలో మే 27 నుండి 3 రోజుల పాటు మహానాడు**

చిత్తూరు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: జాతీయ తెలుగుదేశం మహానాడు పార్టీ పండుగను మే 27, 28, 29 తేదీల్లో కడపలో నిర్వహించాలని ముహుర్తం ఫిక్స్ చేయడంతో ఆ పార్టీలో సంస్థాగత ఎన్నికలకు గంట మోగింది. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా ప్రస్తుతం రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ సిఆర్ రాజన్ వ్యవహరిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ మహానాడు పండుగకు ముందే గ్రామ, వార్డు, డివిజన్, మండల, పట్టణ, నగర పార్టీ అధ్యక్షుల నియామకం చేపట్టి పూర్తి చేసి ఆపై జిల్లా అధ్యక్ష ఎన్నికలు నిర్వహించాల్సి వుండటంతో ఈ సారి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా ఎవరు నియమితులవుతారనే ప్రశ్న ప్రతి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తల్లో తలెత్తుతుంది. మే 27 నుండి మహానాడు ప్రారంభం కానుండటంతో ఏప్రిల్ నెలాఖరు నాటికి గ్రామ, వార్డు, డివిజన్, మండల, పట్టణ, నగర పార్టీ అధ్యక్షుల ఎంపిక పూర్తి చేయాలి. ప్రస్తుతం పార్టీ సభ్యత్వ నమోదు పూర్తి కావడంతో పార్టీ అధిష్టానం పార్టీ సభ్యత్వ గుర్తింపు కార్డులను పార్టీ క్రీయాశీల సభ్యులు, సభ్యులకు పంపిణీ చేస్తున్నది. ఈ ప్రక్రియ రెండు, మూడు రోజుల్లో పూర్తి చేయాలని పార్టీ అధిష్టానం పార్టీ నేతలను ఆదేశించింది. ఆపై ప్రతి బూత్ పరిధిలోని ప్రతి 60 మంది ఓటర్లకు ఇద్దరు గృహసారధులను ఎంపిక చేయాలని పార్టీ అధిష్టానం ఆదేశించడంతో ఇప్పటికే కొన్ని మండలాలు, గ్రామాల్లో ఈ ప్రక్రియ జరుగుతున్నది. ఈ ప్రక్రియ సైతం వీలైనంత త్వరగా పూర్తి చేయాలని పార్టీ అధిష్టానం నుండి ఎమ్మెల్యేలు, నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీలకు స్పష్టమైన ఆదేశాలు రావడంతో గృహసారధుల ఎంపిక కార్యక్రమం ప్రస్తుతం వేగవంతం అయ్యింది. గృహసారధుల ఎంపిక ప్రక్రియ ముగిసిన వెంటనే గ్రామ, వార్డు, డివిజన్ పార్టీ అధ్యక్షుల ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలను సైతం వీలైనంత త్వరగా పూర్తి చేయాలని పార్టీ అధిష్టానం స్పష్టంగా ఆదేశించి వుండటంతో పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు ఇప్పటికే దీనిపై దృష్టి కేంద్రీకరించారు. గ్రామ, వార్డు, డివిజన్ స్థాయి పార్టీ అధ్యక్షుల ఎన్నికలు పూర్తయితే మండల, పట్టణ, నగర పార్టీ అధ్యక్షుల ఎన్నికలు నిర్వహించాల్సి వుంటుంది. గ్రామ, వార్డు, డివిజన్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన వారు, వాటి పరిధిలోని పార్టీలో క్రీయాశీలంగా వుంటే నాయకులు సమావేశం ఏర్పాటు చేసి ఈ మండల, పట్టణ, నగర పార్టీ అధ్యక్షుల ఎన్నికలు నిర్వహించాల్సి వుంటుంది. ప్రస్తుతం మండల, పట్టణ, నగర పార్టీ అధ్యక్షులుగా వున్న నాయకులు ఇది వరకు పార్టీ అధికారంలో లేని సమయంలో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కష్టపడి పని చేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి 9 నెలలు మాత్రమే కావడంతో అత్యధికులు ఈ సారి ప్రస్తుతం వున్న పార్టీ మండల, పట్టణ, నగర అధ్యక్షులను కొనసాగించాలని, మార్పులు, చేర్పులు ఎమైనా వుంటే మరోసారి జరిగే ఎన్నికల సమయం నాటికి చేసుకోవచ్చునని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్ళినట్లు సమాచారం.

## చైర్మన్ అవిశ్వాస తీర్మానం వాయిదా వేయాలని
# కలెక్టర్ కోరిన ఎమ్మెల్యే

**కొనసాగించాలని ఎన్నికల కమిషనర్‌కు వైకాపా నేత విజ్ఞప్తి**





వెంకటగిరి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త ఈనెల తొమ్మిదో తేదీ వెంకటగిరి మున్సిపల్ చైర్ పర్సన్ నక్క భానుప్రియ అవిశ్వాస తీర్మానం వాయిదా వేయాలని ఎమ్మెల్యే కోరుకొండ రామకృష్ణ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కు విజ్ఞప్తి చేశారు. కొందరు కౌన్సిలర్లను కిడ్నాప్ చేశారని కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకుని వెళ్తానని కలెక్టర్ ఎమ్మెల్యేకి తెలిపారు. కాగా ఈనెల తొమ్మిదో తేదీనే కౌన్సిలర్ తో సమావేశం నిర్వహించి తీర్మానాన్ని నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వైసిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి వినతి పత్రం పంపారు. తెలుగుదేశం పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు ఎన్నికల కమిషనర్ కు విజయవాడ మాజీ ఎమ్మెల్యే వైసీపీ నేత మల్లాది విష్ణు ద్వారా ఫిర్యాదు చేయించారు.వెంకటగిరి మున్సిపాలిటీలో 25 మంది కౌన్సిలర్లు వైసిపి వారేనని చైర్పర్సన్ను అక్రమ పద్ధతిలో పదవ నుండి దించాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆయన ఫిర్యాదులు పేర్కొన్నారు. ఈనెల తొమ్మిదో తేదీనే అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే, రాం కుమార్ రెడ్డి ఫోటో ఫిర్యాదులు చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక వైసిపి, తెలుగుదేశం పార్టీ వారికి ప్రతిష్టాత్మకంగా మారింది. ఈనెల తొమ్మిదో తేదీ చైర్ పర్సన్ లెక్క భానుప్రియ పై అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్లు కౌన్సిలర్లు కూడా కలెక్టర్ నుండి నోటీసులు అందాయి. ఈనెల తొమ్మిదో తేదీ అవిశ్వాస తీర్మానం జరుగుతుందా లేదానని ప్రజల్లో సంగీత నెలకొని ఉంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం ఏ విధంగా ఉంటుందా వేసి చూడాలి.

### టిడిపి వారు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు : రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త తెలుగుదేశం పార్టీ వారు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుపల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల తొమ్మిదో తేదీ చైర్పర్సన్ నక్క భానుప్రియ పై అవిశ్వాస తీర్మానం పెట్టమని టిడిపి వారు జిల్లా కలెక్టర్కు లేక ఇచ్చారని తెలిపారు. అయితే తొమ్మిదో తేదీ అవిశ్వాసం నెగ్గదని తెలుసుకొని టిడిపి వారు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జిల్లా కలెక్టర్ ను కలిసి 9వ తేదీ జరగవలసిన అవిశ్వాస తీర్మానాన్ని వాయిదా వేయాలని కోరినట్లు తెలిపారు. అయితే తాను కూడా ఎమ్మెల్యే కన్నా ముందుగానే రాష్ట్ర ఎన్నికల కమిషన్కు అధికార పార్టీ వారు అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదును విజయవాడ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ద్వారా ఫిర్యాదు చేయించినట్లు తెలిపారు. మున్సిపాలిటీలో 25 మంది వైసీపీ కౌన్సిలర్లు ఉన్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ వారికి ఒకరు కూడా లేరని వివరించారు. అయితే వారు ఎలా అవిశ్వాస తీర్మానం పెడతారని ప్రశ్నించారు. అడుగడుగునా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు విమర్శించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మాజీ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ ఆనం విజయకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో మంచినీటి సమస్య
# తలెత్తకుండా తగు చర్యలు
### - ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్



కుప్పం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం నియోజకవర్గంలో వేసవిలో మంచినీటి సమస్య జటిలం కాకుండా తగు చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధి 19వ వార్డులో నూతనంగా వేసిన మంచినీటి బోరును ఆయన పూజ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుప్పం పట్టణంలో ఎన్టీఆర్ సుజల ప్లాంట్లను సైతం అందుబాటులో తెచ్చేందుకు 11 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్లు చెప్పారు. త్వరలోనే ఆ పనులు సైతం ప్రారంభం అవుతాయన్నారు. కుప్పంలో సాగు, తాగునీటి అవసరాలు శాశ్వతంగా తీర్చేందుకు హంద్రీ–నీవాకాలువల పనులు, గండికోట నుంచి పైపులైన్ ఏర్పాటుకు సిఎం చంద్రబాబు చర్యలు చేపట్టారన్నారు. కుప్పంలో వేసవిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తగు ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, రెస్కో ఎండి సోమశేఖర్, ఎడి, డిఇ, మున్సిపల్ ఎఇ ఆంజనేయులు, ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, రాష్ట్ర నేత గోపీనాథ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, కౌన్సిలర్లు సోమశేఖర్, సురేష్, నేతలు జయరాంనాయుడు, కాణిపాకం వెంకటేష్, మంజునాథ్, బాలాజీ, రాధమ్మ, జమీర్, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రనేత గోపీనాథ్‌చే బధిర విద్యార్థులకు అన్నదానం



కుప్పం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్ సోమవారం కుప్పం సమీపంలోని విక్టరీ బధిరుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని బధిర పిల్లలకు తనవంతుగా ఓపూట ఆహారాన్ని అందజేశారు. పిల్లల మధ్య తన జన్మదినోత్సవాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. అంతకుముందు గోపీనాథ్‌ను స్థానిక నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కౌన్సిలర్లు సోమశేఖర్, జాకీర్, నేతలు ఆర్ఆర్ రవి, మంజు, విసి మంజునాథ్, ఉమాపతి, కిరణ్, శ్యామ్‌సుందర్, యశ్వంత్, నరేష్, జనసేన కోఆర్డినేటర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పిఇఎస్‌లో ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

కుప్పం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త

స్థానిక పిఇఎస్ వైద్య కళాశాల ఆస్పత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యకరమైన ఆరంభం – ఆశాజనక భవిష్యత్తు అనే నినాదంతో మాతాశిశు సంరక్షణ, ఆరోగ్యంపై ప్రజలకు ఇన్‌చార్జ్ మెడికల్ సూపరి ంటెండెంట్ డా॥ ర్యాలీ సుబ్బారావు, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా॥ అభిరామి వివరించారు. ప్రసూతి, నవజాత శిశువుల మరణాల నివారణ చర్యలు, తల్లుల మానసిక ఆరోగ్యం, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మనిషి తీసుకోవాల్సిన ఆహారం, పాటించాల్సిన ఆరోగ్య నియమాలను ప్రదర్శన రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఒడిలు డా॥ ప్రదీప్, డా॥ సుభా వెళ్విజి, వైస్ ప్రిన్సిపాల్ డా॥ డేనియల్ అరుణ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా॥ మెల్విన్ డేవిడ్, అసోసియేట్ ప్రొఫెసర్లు శ్రీదేవి, పవిత్ర, దివ్యశ్రీ, అధ్యాపకులు రామకృష్ణ, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న తాసిల్దార్

పూతలపట్టు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త



వెదురుకుప్పం నుంచి పూతలపట్టు మండలానికి బదిలీపై వచ్చిన తాసిల్దార్ రమేష్ బాబు ప్రజా సమస్యల పరిష్కరించడంలో మునుపటి తహసీల్దార్ల కన్నా ఆదర్శవంతంగా పనిచేస్తూ పూతలపట్టు మండలంలోని ప్రజలకు ఏ ఒక్క రైతుకు కూడా కష్టం కలగనియకుండా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేసే దిశగా బాధ్యతగా పనిచేయడం చాలా సంతోషంగా ఉందని పూతలపట్టు మండల ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు. వీఆర్వోలను ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రంలోకి వెళ్ళమని సమస్య ఎక్కడ ఉందో చూసి దాని పరిష్కారానికి దోహద పడమని చెప్పడం తిరిగి తనకు తెలియపరిచేలా చేయమని చెప్పడం జరుగుతున్నది. ఎన్నడూ లేని విధంగా పూతలపట్టు తాసిల్దార్ కార్యాలయానికి సుమారు వందమంది ప్రజా సమస్యల ఫిర్యాదుకు రావడం అక్కడకి వచ్చిన ప్రజలు ఈ తాసిల్దార్ కార్యాలయంలో సమస్య తీసుకుని వస్తే ఆ సమస్య పరిష్కారం చేసి తాసిల్దారు పంపిస్తారని నమ్మకంతో ఆశాభావంతో ఇక్కడికి వస్తున్నామని పూతలపట్టు మండల ప్రజలు తాసిల్దారు రమేష్ బాబు పై ప్రశంసల వర్షం కురిపించారు.

## ఎస్కేఆర్ దంపతులచే కళ్యాణోత్సవం

చౌడేపల్లి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త



పురాతన ఆలయాల పునర్నిర్మాణదాత, బోయకొండ ఆలయ ఛైర్మన్లు ఎస్.కె. వెంకట్రమణారెడ్డి, రతీదేవి, ఆయన కుమారుడు రాజశేఖర్‌రెడ్డి, స్నేహారెడ్డిల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆయన సొంత గ్రామం ఇటుకనెల్లూరులోని సీతారామాలయంలో ఉదయాన్నే వేదపండితులచే స్వామి, అమ్మవార్లకు విశేషా భిషేకం, అలంకరణగావించారు. అనంతరం సీతా, లక్ష్మణ, ఆంజనేయ సమేత రాముల ఉత్సవ విగ్రహాలకు కళ్యాణోత్సవాన్ని కన్నుల పండుగలా నిర్వహించారు. విశేష సంఖ్యలో వచ్చిన భక్తులకు అన్నదాన శిబిరం, పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## ఆలయాల నిర్మాణానికి రూ. లక్ష విరాళం

చౌడేపల్లి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త



సనాతనధర్మ పరిరక్షణా అవార్డు గ్రహీత, బోయకొండ మాజీ ఛైర్మన్ ఎస్కే వెంకట్రమణారెడ్డి దారిలోనే ఆయన మనువడు హరిరుద్రాంశరెడ్డి వెళుతున్నాడు. అడిగిన వారికెల్లా దేవాలయాల నిర్మాణానికి చేతికి వెముక లేకుండా ఇచ్చే తాతా వారస్వతాన్ని మనువడు అందిపుచ్చుకొన్నాడు. ఇటుకనెల్లూరులో జరుగుతున్న సీతారామ కళ్యాణ మహోత్సవంలో భాగంగా ముదిరెడ్డిపల్లి, కందూరు, గల్లావారిపల్లి, బేలుపల్లి తదితర గ్రామాల్లో వివిధ స్థాయిల్లో నిర్మాణంలో వున్న దేవాలయాలకు హరిరుద్రాంశరెడ్డి రూ. లక్షను విరాళంగా అందించి తాతకు తగ్గ మనువడనిపించుకొన్నాడు.

## ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

రొంపిచెర్ల, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:

ప్రజలు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ దినేష్ కుమార్ నాయక్, డాక్టర్ వినయ్ తెలిపారు. ఆరోగ్య కేంద్ర సిబ్బందితో కలిసి ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి పురవీధులలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం మన ధ్యేయం, తల్లి శిశువుల ఆరోగ్యం మన కర్తవ్యం అంటూ నినాదాలు చేశారు. ఆరోగ్య రక్షణ పై గ్రామాలలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు తప్పనిసరిగా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎండలు విపరీతంగా కాస్తున్నాయని, ప్రజలు వడదెబ్బ బారిన పడే అవకాశం ఉందన్నారు. వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బందికి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, హెల్త్ సూపర్వైజర్ పంకజ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రత రోగాలు దూరం

సదుం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త



ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత చేసుకోవడం వల్ల రోగాలు దూరం అవుతాయని చెరుకువారిపల్లె పీహెచ్సీ వైద్యాధికారి చరణ్ అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సదుం, చెరుకువారిపల్లెలో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన వయసులో వివాహం చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రసవాలు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు తనిఖీలు చేసుకోవాలన్నారు. పౌష్టికాహారం పెట్టడం వల్ల తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారు అన్నారు. ఆడబిడ్డకు 21 సంవత్సరాలు మగ బిడ్డకు 20 సంవత్సరాల వయసు వచ్చిన తర్వాత వివాహం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు చొరవ చూపాలి
### - కడ పి.డి. వికాస్ మర్మత్

కుప్పం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. స్థానిక మండల కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రజలు వివిధ సమస్యలపై కడ పి.డి.కి 19వినతిపత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను రెవెన్యూ అధికారులు త్వరితగతిన పరిష్కరించేలా చూడాలని సూచించారు. ఆయా శాఖల ఉన్నతాధికారులు ప్రజల వినతులపై రోజుకు అర్ధగంట సమయం కేటాయించి పరిష్కార మార్గం చూపాలని అలా కాకుంటే కారణం సహేతుకంగా ఉండాలని పేర్కొన్నారు. త్వరలోనే అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు మంజూరవుతాయన్నారు. కార్యక్రమాల్లో డిఇలు పురుషోత్తం, గురవారెడ్డి, తహశీల్దార్ చిట్టిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మూడు నెలలుగా రేషన్‌సరుకులు అందలేదని ఫిర్యాదు

రామకుప్పం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త

మండలంలోని ముద్దనపల్లి పంచాయతీ ఆవులకుప్పం గ్రామంలో గత మూడు నెలలుగా ఎండియు వాహనం రాకపోవడంతో రేషన్ సరుకులు అందడం లేదని గ్రామస్తులు తహశీల్దార్ కౌలేష్‌కు ఫిర్యాదు చేశారు. దాదాపు 175 కార్డులు గ్రామంలో ఉన్నాయన్నారు. ఎండియు వాహనం రాకపోవడంతో దాదాపు మూడు కిలోమీటర్ల దూరం నడిచి ముద్దనపల్లిలో రేషన్‌సరుకులు తీసుకురావాల్సి వస్తోందన్నారు. అక్కడకూడా సర్వర్ సరిగ్గా ఒక్కోసారి పనిచేయడం లేదన్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు మునస్వామి, బాలాజీ, నాగరాజు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీసీతారాములపట్టాభిషేక మహోత్సవం

కుప్పంరూరల్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త



కుప్పం పాతపేటలో వెలసిన శ్రీ కోదండరామస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీసీతారాముల పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి, అమ్మవారిని విశేషాలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాల్లో నిర్వాహకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైకాపా అవినీతి..అక్రమాలను ప్రజలు ఛీకొట్టారు
### - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

శాంతిపురం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త

ఐదేళ్ల పాలనలో వైకాపా ప్రభుత్వం చేసిన అవినీతి, అక్రమాలను ప్రజలు ఛీకొట్టి 11సీట్లకే పరిమితం చేశారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రజలు రాష్ట్రంలో ప్రశాంతంగా ఉంటే జగన్‌రెడ్డి ఏదో ఓ అలజడి సృష్టించాలని కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని విమర్శించారు. శవాల మీద తన రాజకీయ జీవితం నిలబెట్టుకోవాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో శవ రాజకీయాలు చేసి బెంగళూరుకు వెళ్లి రెస్ట్ తీసుకోవడం జరుగుతోందన్నారు. జగన్‌రెడ్డివి దిగజారుడు రాజకీయాలు అని మళ్లీ సీమలో రక్తచరిత్ర మొదలుపెట్టేందుకు చేస్తున్నారా అని ప్రశ్నించారు. వ్యక్తిగత కారణాలతో హత్య జరిగితే దాన్ని రాజకీయం చేయడం దారుణమన్నారు. ప్రజలు ఇకపై జగన్ మోసాలు సహించే స్థితిలో లేరన్నారు.

## డంపింగ్ యార్డ్‌లో వ్యర్థల నియంత్రణకు చర్యలు



పలమనేరు, ఏప్రిల్ 07, ప్రభాతవార్త:

పలమనేరు పట్టణంలోని డంపింగ్ యార్డ్‌లో వ్యర్థల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమీషనర్ రమణా రెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి గొబ్బిళ్ళ కోటూరులో కంపోస్ట్ యార్డ్‌ను పరిశీలించారు. ఈ మేరకు గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థలను సరైన రీతిలో తొలగించేందుకు తగు చర్యలను తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. నిత్యం పట్టణం నుండి తీసుకువస్తున్న వ్యర్థలను సకాలంలో తొలగించకుంటే వ్యర్థలు గుట్టలుగా పేరుకు పోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మొహిద్దీన్, ఇంజనీర్ స్నేహప్రియ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

పలమనేరు, ఏప్రిల్ 07, ప్రభాతవార్త:



మండలంలో ఘనంగా 77వ ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. సోమవారం కొలమాసనపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, సబ్ యూనిట్ అధికారి జయశంకర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలకు ఆరోగ్యంపై పలు సూచనలు, గర్భవతులు తీసుకోవలసిన జాగ్రత్తలు, నవజాత శిశువుల మరణాల రేట్లను తగ్గించటం, ఐరన్ లోపం, అంటు వ్యాధుల నియంత్రణలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమలో సిబ్బంది విజయలక్ష్మి, మధు, అంజలి, ఆశ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ బాధితుడికి ఎంపీ దగ్గుమళ్ళ అండ
### - సిఎం రిలీఫ్ ఫండ్ నుండి రూ.1.86 లక్షలు మంజూరు

చిత్తూరురూరల్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:



కిడ్నీ బాధితుడికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అండగా నిలిచారు. పెనుమూరు మండలం చిన్నకలికిరిపల్లి గ్రామంకు చెందిన తెలుగు దేశం పార్టీ బూత్ కన్వీనర్ ఆర్.చిట్టి గత కొంతకాలంలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ మేరకు అతను ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్‌రావును కలిసి తనకు సిఎం సహాయనిధి నుండి ఆర్థిక సహాయం అందించాలని కోరడంతో ఎంపీ దగ్గుమళ్ళ ఈ మేరకు సిఫార్సు చేసి సిఎం సహాయనిధి నుండి 1.86 లక్షల రూపాయలు ఆర్థిక సహాయంను మంజూరు చేశారు. ఈ మేరకు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు సోమవారం కిడ్నీ బాధితుడు చిట్టికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, జిల్లా పార్టీ కార్యదర్శి రెడ్డప్ప, పెనుమూరు మండల పార్టీ అధ్యక్షులు రుద్రయ్యనాయుడు, తెలుగుదేశం యాదవ సాధికారత సంఘ జిల్లా అధ్యక్షులు శ్రీధర్‌యాదవ్, బీసీ సెల్ అధ్యక్షులు అశోక్, చిన్నకలికిరి మాజీ సర్పంచ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

బంగారుపాళ్యం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:

చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి మల్లీశ్వరం గ్రామ సమీపంలో రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన గంగయ్య(45) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మల్లీశ్వరం గ్రామంకు చెందిన గంగయ్య ద్విచక్ర వాహనంలో గ్రామానికి వస్తుండగా మరొక ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గంగయ్యను చికిత్స నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం తమిళనాడు రాణిపేట సిఎంసి ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా సోమవారం అతను మృతి చెందాడు. మృతితో సోదరుడు విజయకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు.

## జిల్లా దివ్యాంగుల హక్కుల జాతీయ ఐక్యవేదిక అధ్యక్షుడిగా లోకనాథం



చిత్తూరు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:

జిల్లా దివ్యాంగుల జాతీయ ఐక్యవేదిక కమిటీ అధ్యక్షుడిగా లోకనాథం ఎంపికైనట్లు రాష్ట్ర దివ్యాంగుల హక్కుల జాతీయ ఐక్యవేదిక అధ్యక్షులు కలికిరి జయరామయ్య పేర్కొన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర దివ్యాంగుల హక్కుల జాతీయ ఐక్యవేదిక అధ్యక్షులు కలికిరి జకరామయ్య మాట్లాడుతూ నూతన జిల్లా కమిటీని కాణిపాకంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా కమిటీ ఉపాధ్యక్షులుగా రాముడు, కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా సరస్వతి, జాయింట్ సెక్రటరీగా భాస్కర్‌నాయుడు, కార్యవర్గ సభ్యులుగా బాలసుబ్రమణ్యం, సునందలు ఎన్నికయ్యారన్నారు. రాష్ట్రంలో దివ్యాంగులకు కావాల్సింది సానుభూతి, జాలి, దయాగుణం కాదని తమ హక్కుల కోసం పోరాటం చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు లోకనాథం మాట్లాడుతూ దివ్యాంగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడానికి పూనుకోవాలన్నారు. దివ్యాంగులకు ఏ కష్టం వచ్చినా సహకారం అందించడానికి తాను సిద్ధంగా వుంటానని ఆయన పేర్కొన్నారు.

## అగ్ని ప్రమాదాలు జరిగే సమయంలో చేపట్టాల్సిన చర్యలపై అవగాహన

చిత్తూరు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: వేసవి కావడంతో తరచు జరిగే అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో 90 మంది పోలీసులకు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం డిఎస్పీ జె.రాంబాబు, జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డిలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగే సమయంలో తీసుకోవాల్సిన ప్రాథమిక జాగ్రత్తలను పోలీసులకు వివరించారు. అగ్ని నుండి వివిధ రకాల రక్షణ మార్గాలకు వివరించి, అగ్నిమాపక పరికరాల వాడకం, సురక్షిత మార్గాలు ఏర్పాటు, అత్యసర సమయాల్లో స్పందించే తీరు తదితరాలపై ప్రాక్టికల్ డెమో నిర్వహించి వివరించారు.

# చిత్తూరు డివిజన్
చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కాణిపాకం ఆలయానికి 1.50 లక్షలు విరాళం

కాణిపాకం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి పథకాలకు ఓ భక్తుడు సోమవారం 1.50 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన సీహెచ్.రవిశంకర్ అనే భక్తుడు దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నపథకానికి లక్ష రూపాయలను, శ్రీసిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు 50 వేల రూపాయలను విరాళంగా అందించారు. ఈమొత్తాన్ని దాత కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఏఈఓ రవీంద్రబాబుకు .దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన ఎస్వీయూ అధికారులు



చిత్తూరురూరల్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:

చిత్తూరు పట్టణంలో పివికెయన్ కళాశాలలో జరుగుతున్న ఎస్వీయు దూర విద్యా పరీక్షా కేంద్రాన్ని యూనివర్శిటీ అధికారులు సందర్శి:చారు. సందర్శించిన వారిలో ప్రొఫెసర్ వి రమేష్‌బాబు, డైరెక్టర్ ఎస్వీయూనివర్శిటీ ప్రొఫెసర్ వి. రవినాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ జీవన్‌జ్యోతి తదితరులు వున్నారు.

## రాయితీపై ఎర్రజొన్నలు పంపిణీ

వెదురుకుప్పం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :

సబ్సీడి ధరలకు ఎర్రజొన్నలు అందజేయడం జరుగుతుందని అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రూపసుందరి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు 75 శాతం సబ్సీడితో ప్రభుత్వం ఎర్రజొన్నలు అందజేయడం జరుగుతుందన్నారు. మార్కెట్టులో కీలో ధర 92 రూపాయాలు ఉండగా, 75 శాతం రాయితీతో కేవలం కీలో 23 రూపాయాలకు అందిస్తామన్నారు. మండ ల కేంద్రంలోని పశువైద్యాశాలకు 2000 కీలోలు ఎర్రజొన్నలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. అవసరమైన రైతులు పాట్టదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుతో పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

## ఎమ్మెల్యే అధ్యక్షతన రెవెన్యూ సమావేశం

పాకాల, ఏప్రిల్ 7, ప్రభాతవార్త

పాకాల మండలంలోని ఆది ఆంధ్ర, ఆది ద్రావిడ మరియు ఎస్టీ గ్రామాలను సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతాం ఆయా గ్రామాలలో స్మశాన వాటిక లకు దారి సమస్యలను త్వరితగతంగా పరిష్కరించాలి. స్మశాన వాటికకు స్థలాలు లేని పల్లెలకు ఒక నెలలోపు స్థలాల ఎంపిక పూర్తి చేయాలి. మండలంలో రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని రెవెన్యూ అధికారులకు సోమవారం జరిగిన సమావేశంలో దిశా నిర్దేశం చేసారు. పాకాల మండలంలో వీఆర్వో పోస్టులు 6 ఖాళీలు ఉన్నాయి అని దానిపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా ఖాళీలను భర్తీ చేస్తాం అని అలాగే రెవెన్యూ సదస్సులలో 400 ఫిర్యాదులు అందాయి. అందులో 190 మాత్రమే తీర్చగలిగారు కానీ మిగిలిన సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలని తెలియజేశారు.

## స్పెషల్ పార్టీ బలగాలతో కవాతు



పాకాల, ఏప్రిల్ 7, ప్రభాతవార్త

పాకాల మండలంలోని ప్రజలకు శాంతి భద్రతలను కాపాడేందుకు అన్నివిధాల రక్షణగా ఉండేందుకు మేమున్నామని భరోసా కల్పించేందుకే ప్రత్యేక (ఎస్ టి ఎఫ్) స్పెషల్ పార్టీ బలగాలతో సోమవారం కవాతును నిర్వహించినట్లు పాకాల సిఐ సుదర్శన్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఐ సుదర్శన్ ప్రసాద్ మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు చంద్రగిరి డి.ఎస్.పి బి.ప్రసాద్ ఉత్తర్వుల మేరకు పాకాల మండలంలోని అన్ని పంచాయతీలలోని ప్రజలు పోలీసులకు సహకరించి ఏ సమస్య ఉన్న వెంటనే పోలీసులకు తెలియజేయాలని సిఐ సుదర్శన్ ప్రసాద్ ప్రజలకు తెలియజేశారు.

## ఎంపిని కలిసిన పాకాల వాసులు



పాకాల, ఏప్రిల్ 7, ప్రభాతవార్త

చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్ రావుని రేణిగుంట విమానాశ్రయంలో సోమవారం పాకాల విశ్రాంత తాసిల్దారు సుధాకర్, డిఎస్ఎస్ అధ్యక్షులు చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా రేణిగుంట విమానాశ్రయంలో కలిశారు.

## ఆరోగ్యసూత్రాలు పాటిద్దాం.. పండంటి జీవితాన్ని గడుపుదాం

చౌడేపల్లి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త

ఆరోగ్య సూత్రాలు పాటించి పండంటి జీవితాన్ని గడుపుదామని వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురష్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రుల్లో కాన్పు చేయించుకోవడం వల్ల తల్లీబిడ్డలు సురక్షితంగా వుంటారన్నారు. ఆరోగ్యవంత జీవితానికి తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు. పిహెచ్ఎన్ కృష్ణవేణమ్మ, సూపర్‌వైజర్ బాహుద్దీన్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరోగ్యానికి మింగి ఆస్తి లేదు

గుడిపాల, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:



మానవుడికి ఆరోగ్యానికి మించి మరొక ఆస్తి లేదని గుడిపాల పిహెచ్‌సి డాక్టర్ సంధ్య పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని సోమవారం పిహెచ్‌సి ఆవరణలో ప్రజలు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె ప్రజలకు వివరించారు. ప్రతి మనిషి పోషకాలతో కూడిన కలుషితం కాని ఆహారం తీసుకోవాలని, ఎలాంటి చెడు అలవాట్లు లేకుండా ఆరోగ్యంను సంరక్షించుకోవాలన్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన సత్వరం వైద్యులను సంప్రదించి వైద్య సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బాల సూర్యనారాయణ, సిహెచ్ఓ విజయ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన పూతలపట్టు ఎమ్మెల్యే

చిత్తూరు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:



పూతలపట్టు నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మురళీ మోహన్ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీమోహన్ కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో మాట్లాడుతూ తన నియోజకవర్గ పరిధిలో పలు సమస్యలు వున్నాయని వాటిని పరిశీలించి పరిష్కరించాలన్నారు. తవణంపల్లి మండలం ఎ.గొల్లపల్లి ఎస్టీ కాలనీలో దాదాపు 50 సంవత్సరాలుగా నివసిస్తున్న ప్రజల గృహాలకు ఇప్పటి వరకు ప్రభుత్వ గుర్తింపు, ధృవీకరణ లేదన్నారు. ఇక్కడి ప్రజలు వారి వారసులకు భవిష్యత్తులో గృహాలపై హక్కులను తర్జుమా చేసే సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం భూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న తరుణంలో ఎ.గొల్లపల్లి ఎస్టీ కాలనీ ప్రజల భూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వారికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందిస్తూ ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించి సమస్యను 20 నుండి 25 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. అలాగే బంగారుపాళ్యం కేంద్రంలో సుమారు వెయ్యి ఎస్సీ కుటుంబాలు నివాసాలు వుంటున్నాయని, ఇక్కడి వారి అంతిమ సంస్కారానికి భూమి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, స్మశాన వాటిక నిర్మాణం కోసం అవసరమైన భూమిని గుర్తించి కేటాయించాలని ఎమ్మెల్యే కలెక్టర్‌ను కోరారు. శ్మాసన వాటిక నిర్మాణానికి అవసరమైన భూమి ప్రభుత్వం కొనుగోలు చేసి వారికి ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

# తిరుపతి డివిజన్

## విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



పుత్తూరు రూరల్, ఏప్రిల్ 7 ప్రభాత వార్త: పుత్తూరు పట్టణంలోని ఎస్ఆం ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 2025-2026 విద్యా సంవత్సరం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 1 తేదీ నుంచి ప్రారంభించడం జరిగింది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏపీ ప్రభుత్వం ఉచితంగా అందించిన నోటు పుస్తకాలను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ దర్గాగోపాల్‌రెడ్డి విద్యార్థులకు అందించారు. ఇంకా కళాశాలకు రాని విద్యార్థులు కళాశాలకు వచ్చి పాఠ్యపుస్తకాలను నోటు పుస్తకాలను తీసుకుని కళాశాలకు తప్పని సరిగా హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఏకాంబరాచారి, నిరంజన్, అమ్ముదేవి, రమాదేవి, సునీత, చక్రధర్, అపరంజి, కేశవరెడ్డి, ఆర్‌పి, సీనియర్ సహాయకులు శ్రీరాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మండల అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదు

పుత్తూరురూరల్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: పుత్తూరు మండల పరిషత్ అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని సోమవారం ఎంపీపీ మునివేలు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ప్రజా ఫిర్యాదుల దినోత్సవంలో భాగంగా వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుత్తూరు మండల పరిషత్ పరిధిలో అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. మండల పరిషత్‌లో సుమారు రూ.70 లక్షలు నిధులు ఉన్నాయని, ఆ నిధులను అభివృద్ధి పనులకు ఖర్చు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆమె తెలియజేశారు.

## ప్రాణాలైనా అర్పిస్తాం... సెంటు భూమి కూడా ఇవ్వం



సత్యవేడు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: సత్యవేడు మండలం శ్రీసిటీ పరిధిలో ఇరుగుళం, కొల్లడం, పెద్ద ఈటిపాకం, రాళ్ళకుప్పం గ్రామాల్లో ఏపీఐ ఐసీ ద్వారా సేకరిస్తున్న బలవంతపు భూసే కరణను మానుకోవాలని పలువురు రైతులు కోరారు. ఈ ప్రాంతంలో రెండో విడత భూసే కరణకు సంబంధించి ప్రభుత్వం ప్రకటన విడు దల చేసిన నేపథ్యంలో సోమవారం ఇరుగుళం గ్రామంలో పలువురు రైతులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు విజయశంకరరెడ్డి, బాలసుందరంరెడ్డి మాట్లాడుతూ ఏపీఐఐసీకి ఒక సెంటు భూమి కూడా ఇచ్చేది లేదన్నారు. గతంలో ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటు సమయంలోనే పారిశ్రామిక వాడకు భూములు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేయలేదన్నారు. ఈ నేపథ్యం లో 2007లో మొదటి దశ భూసేకరణ సందర్భంగా ఇరుగుళం, కొల్లడం, పెద్ద ఈటిపాకం తదితర గ్రామాల్లోని రైతులు భూములు ఇవ్వకపోవడాన్ని వారు గుర్తు చేశారు. దీనిపై అనేక పోరాటాలు, ఆందోళనలో కూడా చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు రైతులు పలువురు ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు. సమా వేశంలో రైతులు శ్రీరామచంద్రరెడ్డి, నిరంజన్‌రెడ్డి, సుశీల్‌కుమార్‌రెడ్డి, ముని చంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రవిరెడ్డి, మురళీ నాయుడు, రజనికాంత్, రాజేష్, మనోజ్, ధనంజయ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

సత్యవేడు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: నవజాత శిశు మరణాలను అంతం చేయడానికి మహిళల ఆరోగ్యం పట్ల ప్రాధాన్యత ఇవ్వాలని సత్యవేడు మండలం దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అరుణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యానికి మూల స్తంభమైన తల్లీబిడ్డ సంరక్షణ ముఖ్యమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఏడాది ఏప్రిల్ 7వ తేదీ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్ నాగజ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ మురళి, ఎంఎల్‌హెచ్‌పీ మహాలక్ష్మి, భానుమతి, పవన్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యకరమైన ప్రారంభం ఆశాజనక భవిష్యత్తు




చంద్రగిరి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: 2025 ఆరోగ్యకరమైన ప్రారంభం ఆశాజనక భవిష్యత్తు నినాదంతో తల్లి, నవజాత శిశువుల ఆరోగ్యంపై దృష్టి సారించి నివారించగలిగిన మరణాలను అంతం చేయాలని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఐ.యుగం ధర్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వైద్య సిబ్బందితో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ యోగ, ద్యానంపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయిలక్ష్మి, ప్రణతి, హెల్త్ ఎడ్యుకేటర్ ఎం.టాటా బాయి, సూపర్‌వైజర్ కె.నారాయణరాజు, ఎం.ప్రమీల, ట్యూటర్స్ సుభాషిణి, రజిని, ఏఎన్ఎంలు సుబ్బలక్ష్మి, శశిరేఖ, గిరిజ, ఫార్మశీ ఆఫీసర్ ఎ.వెంకటరమణ, ఎస్.ఎన్.దేవిక, రజని, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల దాహార్తికి చలివేంద్రం



చంద్రగిరి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు పంచాయతీ తరపున చలివేంద్రం ప్రారంభిస్తున్నట్లు సర్పంచ్ ముద్దికుప్పం రూపరామ మూర్తి తెలిపారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద సోమవారం ఆమె చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మజ్జిగను పంపిణీ చేసి దాహార్తిని తీర్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఏటా వేసవిలో చలివేంద్రాన్ని ప్రారంభించడం ఆనవాయితీగా వస్తున్న ట్లు తెలిపారు. వేసవిలో నీటి వృదాను నివారించి ప్రతి ఒక్కరూ చల్లని నీటితో దాహార్తిని తీర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఇన్‌చార్జ్ వెంకటరత్నం, పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సంస్కృత వర్సిటీలో వివిధ పరిషత్తులు సమాపన సమారోహం



తిరుపతి విద్య, మార్చి 7 ప్రభాతవార్త : జాతీయ సంస్కృత వర్సిటీలో విద్యా ర్థుల భాషణ, స్మృతి శక్తిని, పోటీ తత్వాన్ని పెంపొందించడం కొరకు సంస్కృత భాషకు వాగ్వర్ధినీ పరిషత్, ఆంగ్లం భాషకు మాక్స్ ముల్లర్ ఇంగ్లీష్ క్లబ్, తెలుగు అన్నమాచార్య కళాపరిషత్,హిందీ భాషకు తులసీదాస్ హిందీ పరిషత్ విద్యార్థుల్లోని విభిన్న కౌశలాలనున వెలికితీస్తూ వివిధ పోటీల్లో అగ్ర గామిగా నిలుస్తుంది.ఈ పరిషత్తుల సమాపన సమారోహం వర్సిటీలోని చెలికాని అన్నారావు సభా భవనంలో సోమవారం నిర్వహించడం జరిగినది.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్సార్ కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్నటువంటి కౌశలాలను పెంపొందించడం కొరకు ఈ పరిషత్తులు ఎంతో విశేషమైన కృషి చేస్తున్నాయని తెలియజేశారు.ఈ కార్యక్రమా నికి కోఆర్డినేటర్గా వాగ్వర్ధినీ పరిషత్ కోఆర్డినేటర్ డా.సి.హెచ్. నాగరాజు, అడిషనల్ కోఆర్డినేటర్గా డాక్టర్ ఉదయన హెగ్డే పాల్గొన్నారు.

## యూఎస్ సదస్సుకు మహిళా వర్సిటీ విద్యార్థిని




తిరుపతి విద్య, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా రెనోలోని నెవాడా విశ్వవిద్యాలయం వేదికగా జూన్ 16 నుంచి జూలై 24వతేదీ వరకు ఆరువారాల పాటు జరగనున్న ఖీరూల్ ఆఫ్ లా అండ్ పబ్లిక్ సర్వీస్ పై స్టూడెంట్ లీడర్స్ ప్రోగ్రామ్‌కి సదస్సుకు మహిళా వర్సిటీ లా విభాగం విద్యార్థిని నూకతోటి భార్గవి ఎంపికైంది. ఈ మేరకు వీసీ ప్రొఫెసర్ ఉమ సోమవారం విద్యార్థినికి యూఎస్ ఆహ్వానపు పత్రాన్ని అందించారు. సదస్సుకు ఎంపికైన విద్యార్థినిని వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని,డీన్ విజయలక్ష్మి,ప్రొఫెసర్ ఆర్ ఉమ,అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

## చలివేంద్రాల్లో చల్లని తాగునీరు అందిస్తాం : కమిషనర్




తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: వేసవిలో నగర ప్రజలు, యాత్రికుల దాహార్తిని తీర్చేందుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాల్లో చల్లని (కూల్)నీరు అంది స్తామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రామానుజ కూడలి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం మధ్యాహ్నం కమిషనర్ ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రజలు, విచ్చేసే యాత్రికులకు వేసవిలో దాహార్తి తీర్చేందుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. నగరంలోని 12 ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ చలివేంద్రాల్లో చల్లని(కూల్ వాటర్) త్రాగునీరు అందుబాటులో ఉంచుతున్నామని అన్నారు. ఎవరైనా దాతలు ముందుకు వస్తె చల్లని మజ్జిగ కూడా అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామని, దాతలు ముందుకు వచ్చి సాయం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డిఈ లలిత తదితరులు ఉన్నారు.

## మోడీ పాలనలో దేశం కార్పొరేట్ పరం

### -ప్రధాని వైఖరి మారకుంటే నివరధిక సమ్మె



తొట్టంబేడు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : కార్పొరేటర్లను సంతృప్తి పరచడానికి ప్రభుత్వ రంగానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉరి వేస్తోందని వక్తలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చూస్తూ కూర్చుంటే మోడీ దేశాన్ని కార్పొరేట్ పరం చేయడం ఖాయమని హెచ్చరించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ప్రారంభమైన ఆలిండియా 4వ ద్వైవార్షిక సర్కిట్ సమావేశాల్లో భాగంగా సోమవారం డెలిగేట్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ పోస్టుమెన్, ఎంటిఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్సీ సారంగ్ హాజరయ్యారు. మోడీ విధానాలపై సారంగ్‌నిప్పులు చెరిగారు. లాభాల్లో నడుస్తున్న పోస్టల్‌తో పాటు రైల్వే, రవాణా, బొగ్గు గనులు, ఓడల నిర్మాణం, డిఫెన్స్, విద్యుత్, స్టీలు, పెట్రోలియం, టెలికం, బ్యాంకు, బీమా రంగాలను ప్రైవేటు పరం చేయడానికి మోడీ ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఉద్యోగ, కార్మికుల సమస్య కాదని, ప్రజలు కూడా ముక్తకంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. 2014 నుంచి తపాలాశాఖను కార్పొరేట్ పరం చేసేందుకు మోడీ ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. అందులో భాగంగా మాజీ క్యాబినెట్ కార్యదర్శి టిఎస్ఆర్ సుబ్రమణ్యం నేతృత్వం లో టాస్క్‌ఫోర్స్ కమిటీని కూడా వేసిందన్నారు. లాభదాయకమైన పోస్టల్ సేవింగ్స్ బ్యాంకు, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, స్పీడ్ పోస్టు, పార్సల్ వంటి విభాగాలను కార్పొరేట్ చేయడానికి ప్రత్యేక విభాగాలను నియమించినట్లు తెలిపారు. దీనిని వ్యతిరేఖిస్తూ ఎన్ఎఫ్‌పిఈ అనుబంధసంఘాలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈప్రయత్నా లను కేంద్ర ప్రభుత్వం వెంటనే మానుకుని తపాలా ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలిండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సర్కిల్ కార్యదర్శి బి.శ్రీధర్‌బాబు, మహదేవయ్య, పాండురంగారావు, శరత్‌కుమార్, శ్రీనివాసరావు, స్థానిక సంఘ నాయకులు కె.మురళీ, కుర్షిద్‌బేగం, మదన్‌మోహన్‌రెడ్డి, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలతో పులివర్తి సుధారెడ్డి ముఖాముఖీ

### -మహిళల అభివృద్ధి లక్ష్యంగా ముందడుగులు



చంద్రగిరి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: చంద్రగిరి కొత్తపేటలో సోమవారం ఎంఎల్ఏ పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి నిర్వహించిన మహిళలతదో ముఖాముఖీ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వడివడిగా ముందడులు వేస్తున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా మహిళలకు ప్రభుత్వ పథకాలు, స్వయం ఉపాధి, సంఘాల ద్వారా పూర్తి మద్దతు ఇవ్వనున్నట్లు తెలిపారు. చిన్న తరహా పరిశ్రమలు, టైలరింగ్, అల్లికలు, డ్రైవింగ్, సెల్‌ఫోన్ సర్వీస్ కోర్సులకు ఉచితంగా శిక్షణ అందించి ఆర్థికంగా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళల భద్రతకు శక్తియాప్, 1002 అత్యవసర సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. రేషన్ కార్డులు, ఇళ్ళ స్థలాలు, ఇతర సమస్యలపై సచివాలయాలలో దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. ఎంఎల్ఏ పులివర్తి నాని రాకతో కూటమి ప్రభుత్వం చంద్రగిరిలో గంజాయి నిర్మూలనతో పాటు సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాన్, ఐటి మంత్రి నారా లోకేష్ మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌భాషా, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, తుడా మాజీ డైరెక్టర్ ఏజి పల్లి బాల, తెలుగుయువత మండల అధ్యక్షుడు రాజులగారి వినోద్‌కుమార్‌రెడ్డి, టిడిపి మండల మాజీ ఉపాధ్యక్షుడు కడియాల రవితేజ యాదవ్,మంగాపురం భాస్కర్, టిడిపి నాయకులు పులికంటి మోహన్‌రెడ్డి, ఉమాపతిరెడ్డి, సక్కుర్ ధనంజయరెడ్డి, డిష్ గోపి, తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతాయుతంగా సేవలు అందిస్తా : ఎంపిపి



తిరుపతిరూరల్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: బాధ్యతాయుతంగా మండల అభివృద్ధికి కృషి చేస్తాని మండలాధ్యక్షుడు మూలం చంద్ర మోహన్‌రెడ్డి తెలిపారు. తిరుపతి రూరల్ మండలాధ్యక్షుడుగా అట్టహసంగా సోమవారం మూలం చంద్ర మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. చంద్రగిరి వైకాపా ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు నిర్వహించి, బాధ్యతలు స్వీకరించారు. మండలంలో 34 పంచాయతీలలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతానని, ప్రజాశ్రేయస్సు కోసం కృషి చేస్తానని స్పష్టం చేసారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారుల సమన్వయంతో వేసవి దాహార్తిని తీర్చుటకు కృషి చేస్తానని తెలిపారు. తనపై ఎంతో నమ్మకం, విశ్వాసంతో ఎంపిపి బాధ్యతలు అప్పజెప్పిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి, చంద్రగిరి వైకాపా ఇన్‌చార్జి చెవిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఎంపిపి బాధ్యత స్వీకరణలో మండల ఉపాధ్యక్షులు విదుదల మాధవరెడ్డి, యశోధ, వైకాపా మండల అధ్యక్షుడు కొత్తపాటి మునీశ్వరరెడ్డి, జడ్పీటిసి రత్నమ్మ, మండల నాయకులు చంద్రశేఖరరెడ్డి, ఉపేంద్రరెడ్డి, బచ్చిరెడ్డి, సర్పంచ్‌లు జోగి మోహన్, వెంకటరమణ, కోటేశ్వరరావు, మొక్కల భారతి, ప్రసాదరెడ్డి, కరమల్ల వల్లీ, సుధాకర్‌రెడ్డి, పొట్టేలి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యోగతో సంపూర్ణ ఆరోగ్యం



తిరుపతిరూరల్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: నిరంతరం యోగ చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చువని జడ్జి ఎ.నరసింహమూర్తి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్జి ఎ.నరసింహమూర్తి పాల్గొని, ర్యాలీని ప్రారంభించారు. మరో అతిథి సుమతిరెడ్డి మాట్లాడుతూ మంచి ఆరోగ్యం మన చేతులలోనే ఉందని, దుర అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనసూయ పౌంటేషన్ ఆధ్వర్యంలో చెట్ల పెంపకం, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. ప్రకాష్‌రెడ్డి, వేరాదేవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



తిరుపతి హెల్త్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ తల్లి, పిల్లల ఆరోగ్యాన్ని పెంపొందించడానికి ఆయుష్మాన్ భారత్, జాతీయ ఆరోగ్య మిషన్ వంటి కార్యక్రమాల ద్వారా సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. గర్భిణీ స్త్రీలకు పోషకాహారం, విశ్రాంతి, గర్భధారణ ప్రమాద సంకేతాలు, గర్భ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తపై అవగాహన అందజేశారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి స్విమ్స్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఆర్ రెడ్డి, మెటర్నటీ ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, డీఎల్ఎల్‌టీఓ డాక్టర్ పద్మావతి, ఏపీడెమాలజిస్ట్ డాక్టర్ లావణ్య, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు కిరణ్‌కుమార్, డెప్యూటీ డెమో ఇతర సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎం ఇచ్చిన హామీని నెరవేర్చిన కలెక్టర్

### - బాధితులకు రూ.లక్ష చెక్కు అందజేత

తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాలో తిరుచానూరు నందు ఏజీఅండ్‌పీ ప్రథమ్-థింక్ గ్యాస్ కంపెనీ వారి డొమెస్టిక్ పైప్లైన్ సహజ వాయు సరఫరా ప్రారంభ కార్యక్రమ పర్యటన నేపథ్యంలో ఈ సంవత్సరం జనవరి 12న రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు గృహ సందర్శన సమయంలో కుటుంబంలోని మహిళ కె. లీలావతి, భర్త శరవణ వారు తమకు ఇల్లు మంజూరు చేయమని, ఆర్థిక సహాయం చేయాలని కోరగా సీఎం నమ్మతించి తగు చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కి ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో సీఎం పర్యటనలో ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ నేటి సోమవారం సదరు గృహిణి కె.లీలావతి దంపతులకు ఒక లక్ష రూపాయల చెక్కును గృహ మంజూరుతో అందించారు. సదరు దంపతులు సీఎంకి ధన్యవాదాలు తెలిపారు.

## సందీప్ చేసిన సేవలు అభినందనీయం



రేణిగుంట ఏప్రిల్ 7 ప్రభాతవార్త: రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐగా సందీప్ చేసిన సేవలు అభినందనీయ మని తిరుపతి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ మధుసూదన్ అన్నారు. రేణిగుంట ఐపీఎఫ్(రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ) సందీప్ దాదాపు రెండున్నర సంవత్సరాలు రేణిగుంట ఆర్పిఎఫ్ స్టేషన్ నందు సిఐగా పనిచేస్తూ బదిలీ అయిన సందర్భంగా రేణిగుంట లోని ఓ ప్రైవేట్ హోటల్లో సోమవారం అభినందన సభలో సందీప్‌కు పౌర సన్మానం చేశారు. రేణిగుంట సర్పంచ్ నాగేషం అధ్యక్షతన పౌర సన్మానం జరిగింది. రేణిగుంట అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్‌రెడ్డి, పలువురు మార్వాడి పెద్దలు, పుర ప్రముఖులు, టాక్సీ ఆటో యూనియన్ నేతలు సందీప్ కు పూలమాలలు వేసి శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. బదిలీలు ప్రభుత్వ ఉద్యోగులకు తప్పదని అయితే ఎక్కడ పనిచేసిన మంచి పేరు తెచ్చుకునే మనస్తత్వం కలిగిన గొప్ప అధికారిగా సందీప్ ను అభివర్ణించారు. కార్యక్రమంలో జీఆర్పి, ఆర్పిఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుండే లోకజ్ఞానం కలిగి ఉండాలి




తిరుపతి విద్య, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : విద్యార్థి దశ నుండే లోకజ్ఞానం కలిగి ఉండాలని నేషనల్ సాంస్కృతిక యూనిర్సిటీ జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక నలంద మార్గ్ కట్టుకిందపల్లిలో ఉన్న నలంద హైస్కూల్ 35వ వార్షికోత్సవం కచ్చపి కళామందిరంలో ఘనంగా నిర్వహించారుఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నేషనల్ సాంస్క్రిట్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జి ఎస్ ఆర్ కృష్ణమూర్తి,నలంద పాఠశాల కరస్పాండెంట్ వెంకటరమణారెడ్డి, ఆనంద్‌రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలన్నారు. డైరెక్టర్స్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ పట్టదలతో చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మునికృష్ణ, రవీంద్రనాథ్ రెడ్డి, భాస్కర్ రాజు, సుబ్రహ్మణ్యం రాజు, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమే.. మహాభాగ్యం : డాక్టర్ శాంతి



రేణిగుంట ఏప్రిల్ 7 ప్రభాతవార్త : ఆరోగ్యాన్ని మించిన మహాభాగ్యం మరొకటి లేదని రేణిగుంట రితిక ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ శాంతి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం డాక్టర్ శాంతి ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడుతూ అందరూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ఆరోగ్యాన్ని మించిన సంపద లేదని తెలిపారు. రోగాలు వచ్చి బాధపడడం కంటే రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నో రకాల వ్యాధులను ఆహారం సరైన సమయానికి తీసుకోవడం, వ్యాయామం చేయడం, మనసును ప్రశాంతంగా ఉంచుకోవడం వల్ల రాకుండా చేసుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. మధుమేహం, రక్తపోటు చాలామందిలో వంశపారంపర్యంగా వచ్చే వ్యాధులు ఉన్నారు. వ్యాధి లక్షణాలు బయటపడడానికి చాలా సమయం పడుతుందన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం, ధ్యానం చేయడం ద్వారా ఎన్నో వ్యాధులను అరికట్టవచ్చు అన్నారు. రోజుకు సుమారు 40 నిమిషాలు నడిస్తే ఆరోగ్యానికి మంచిదన్నారు. వీలైనంతవరకు కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను, నూనెలో వేయించిన పదార్థాలను, పిజ్జాలు, బర్గర్లు, ఐస్ క్రీమ్ లు దూరం పెట్టాలన్నారు. ముఖ్యంగా గర్భవతులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. గర్భం దాల్చినప్పటి నుండి దగ్గర్లోని గైనకాలజిస్ట్, లేదా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో సంప్రదించి వారి సలహాలు సూచనలు తీసుకోవాలన్నారు. బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే తల్లులు వారికి తప్పనిసరిగా ముర్రపాలు తాగించాలన్నారు. ప్రస్తుతం వైద్యరంగం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అంతుచిక్కని రోగాలకు కూడా అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

## కేఎంఆర్ కళాశాల గుర్తింపును రద్దు చేయండి

తిరుపతి విద్య,ఏప్రిల్ 7 ప్రభాతవార్త :ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, వర్సిటీ నియమ నిబంధనలకు విరుద్ధంగా పుత్తూరులో కొనసాగుతున్న కేఎంఆర్ న్యాయ కళాశాల గుర్తింపును రద్దుచేసి అక్కడ చదువుతున్న విద్యార్థులను ఇతర న్యాయ కళాశాలలో ప్రవేశం కల్పించి న్యాయం చేయాలని ఉప కులపతి ఆచార్య అప్పారావుకు ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ వినతిపత్రం ఇచ్చారు. ఒకే భవనంలో బీఈడీ, డిఎడ్,నర్సింగ్, ఫిజియోథెరపీ కోర్సులు నిర్వహిస్తున్నారు.కావున సంబంధిత న్యాయ, బీఈడీ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని కోరారు.

## విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యం




శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్మ మని ఆక్స్‌ఫర్డ్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ సి.మధుసూదనరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధిలో ఉన్న ఆక్స్‌పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వెళ్తున్న విద్యార్థులకు గ్రాడ్యు యేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూధన్‌రెడ్డి చేతుల మీదుగా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు విద్యార్థులకు అందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దర్గామిట్టలో పల్లెనిద్ర కార్యక్రమం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : పల్లెనిద్ర కార్యక్రమం పట్టణంలోని దర్గామిట్టలో అర్బన్‌సిఐ డి.గోపి ఆధ్వర్యంలో నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దర్గామిట్టలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడి ప్రజలతో మమేకమై వారి సమస్యలను, కాలనీలో ఉన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరి స్తుంటే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. ఈప్రాంత ప్రజలకు సైబర్ క్రైం, మహిళలపై, చిన్నపిల్లలపై జరిగే నేరాలు గురించి వాని నివారణ చర్యలు శక్తి యాప్ యొక్క ఉపయోగాలు గురించి అవగాహన కల్పించి 112కు డయల్‌చేస్తే వెంటనే పోలీసులు అక్కడకి చేరుకుంటారన్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం హిందూముస్లింలు అందరు బాయి బాయిగా కలసి మెలసి ఉంటారని పండుగల్లో కూడా అందరు ఒకరినొకరు సహకరించుకుంటా రన్నారు. ఎవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. కొట్లాటలు, గొడవలు వద్దని కాలనీ వాసులకు సూచించారు. కార్యక్రమంలో అర్బన్ సిఐ గోపితో పాటు పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## 19న సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి

తొట్టంబేడు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా మరియు శ్రీకాళహస్తి గౌడ సంఘం అధ్యక్షుడు తిరుకాల వెంకటముని బాబుగౌడ్, అంతటి రమేష్‌బాబు గౌడ్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తికి చెందిన వెంకటమునిబాబు గౌడ్‌లో కార్యాలయంలో ఈనెల 19వ తఏదీన సర్దార్ గౌతులచ్చన్న వర్ధంతి సందర్భంగా గౌడసంఘం సభ్యులచే అన్నదాన కార్యక్రమం వుంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్ఏ బొజ్జల సుధీర్‌రెడ్డితో పాటు గౌడ సోదరులందరు ముఖ్యఅతిథులుగా హజరై విజయవంతం చేయాలన్నారు.

## సెయింట్ జేవియర్స్‌లో వార్షికత్సోవ వేడుకలు



తొట్టంబేడు, ఏప్రిల్ 7ప్రభాతవార్త: మండలంలోని ఎల్ఐసి కాలనీ సమీపంలో సెయింట్ జేవియర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 42వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా ఐదుమంది ఫాదర్స్ మరియు అధ్యక్షులు ఆఫ్ అల్యూమినియం అసోసియేషన్ విశాలాక్షి, చీఫ్ గెస్ట్‌గా పాఠశాల ముఖ్యఅతిథగా విచ్చేశారు. అనంతరం విశాలాక్షి మేడంను మరియు ఫాదర్స్ యొక్క 42వ వార్షిక దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించి నందుకు ఉపాధ్యాయులందరినీ అభినందించారు.

## 2025 సంవత్సరానికి ఇంటర్ ప్రవేశాల దరఖాస్తులు



తొట్టంబేడు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: 2025 విద్యాసంవత్సరానికి గాను సోమవారం నుంచి ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. ఈనేపథ్యంలో సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన ఆమట్లాడుతూ నేటి నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్ ప్రవేశాల కోసం విద్యార్థుల వద్దనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఉన్నత విలువలతో కూడిన విద్యను తమ కళాశాల విద్యార్థులకు అందజేస్తుందని కావున విద్యార్థులు తమ ప్రభుత్వ కళాశాలల్లో చేరి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఈసందర్భంగా విద్యార్థులను ఆయన కోరారు.

## చెంచురెడ్డిని పరామర్శించిన మాజీ ఎంఎల్ఏ



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : మాజీ శాసనసభ్యులు తాటిపర్తి చెంచురెడ్డి ఆరోగ్యం గురించి శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూధనరెడ్డి మరియు శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు నియోజకవర్గ వైకాపా యువజన అధ్యక్షుడు శ్రీవారి సురేష్, పిఎంచంద్ర, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎస్‌బి వార్షిక ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం



గూడూరు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: గూడూరు రెండవ పట్టణంలో ఉన్నటువంటి శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు 2024-25 సంవత్సరానికి గాను అత్యుత్తమ మేధా శారీరక ప్రవర్తనా ప్రతిభ కనబరిచినటువంటి విద్యార్థిని విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు పట్టణ ప్రముఖ యోగ అధ్యాపకులు రాజా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మేదస్సు సరిగా పనిచేయాలి అంటే శారీరక వ్యాయామం ఉండాలని అందుకు యోగాసనాలు ప్రముఖంగా ఉపయోగపడ తాయని వారి యొక్క శారీరక ఆకృతితో పాటు మేధస్సు అభివృద్ధి చెంది తమ విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తారని అందుకు మంచి పోషకాహం ాన్ని తల్లిదండ్రులు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రశాంత్ మాట్లాడుతూ ఆంగ్లంలో విద్యార్థులు అనర్గళంగా మాట్లాడాలంటే తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉపాధ్యాయులు యొక్క సూచనలు పాటించాలని అందుకు వేసవి సెలవులలో ఆన్లైన్లో తరగతులు జరుగుతాయని తెలిపారు. ఎన్ఐటి విద్యార్థి వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఒక లక్ష్యం అనేది ఉండాలని అందుకు సహకరించేటటువంటి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఎంతో గొప్ప వారని వారి సహకారం లేకుండా ఏ విద్యార్థి కూడా ఏది సాధించలేరని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ నవకోటి నాయుడు మాట్లాడుతూ ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి రాజన్న యొక్క సూచనలు పాటిస్తే మన ఆరోగ్యం ఎంతో బాగుంటుం దని యోగా వలన అనేక సమస్యలు, రోగాలు తగ్గుతాయని, మానసిక ప్రశాంతత దొరుకుతుందని తెలిపారు. ఈ వేసవి సెలవులలో పిల్లలకు భవిష్యవాణి అనే ఒక పుస్తకాన్ని ఇస్తామని అందులో సూచనలు తప్పకుండా పాటించే విధంగా తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని వారితో సంయమనం పాటిస్తూ వారి దగ్గర ఆ పనులు చేయించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ సి.డి. సునీల్ రాజు, అకడమిక్ కోఆర్డినేటర్ కె. హరికృష్ణ, ప్రైమరీ ఇన్‌చార్జ్ సి. సింధు, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎన్‌బికేఆర్‌లో సైబర్ సెక్యూరిటిపై అవగాహన



కోట,ఏప్రిల్ 7 ప్రభాతవార్త: మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికేఆర్ ఐఎస్‌టిలో సైబర్ సెక్యూరిటి ఫండమెం టల్స్ అండ్ ప్రాక్టికల్ అప్లికేషన్ అనే అంశంపై నాలుగురోజుల పాటు జరిగే వర్క్‌షాపు సోమవారం ప్రారంభమైంది. ఈ వర్క్ షాపులో సుప్రజా టెక్నాలజీ బృందం నిర్వహించింది. కళాశాల డైరెక్టర్.డాక్టర్. విజయకుమార్‌రెడ్డి మాట్లడుతూ యూపిఐ, ఆన్‌లైన్, ఇంటర్నెట్, బ్యాంకింగ్, క్రెడిట్ కార్డుల మోసాలు, షిషింగ్ ,క్రిప్టో కరెన్సీ,బ్లాక్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు, ఈ కేవైసీలు, పేరట న్యూడ్ వీడియో కాల్స్ వంటి మోసాలు నేడు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నాయన్నారు.ప్రతి ఒక్కరికి సైబర్ సెక్యూరిటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో సిఎస్‌సి విభాగాధిపతి డాక్టర్, రాజశేఖర్ రెడ్డి,సెక్యూరిటి క్లబ్ ఇన్ చార్జి శివప్రతాప్ రెడ్డి,ఐఇఇఇ,ఎస్‌బి కౌన్సెలర్, సురేష్‌బాబు.చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**ఎన్‌బీకేర్‌లో సాంకేతిక ఉత్సవం 2కె25 ఫోస్టర్ ఆవిష్కరణ:**

మండలం విద్యానగర్‌లోని సిఎస్ఇ,ఐటి, ఎఐ, అండ్ డిఎస్ విభాగాల సంకయక్త ఆధ్వర్యంలో సోమవారం సాంకేతిక ఉత్సవం 2కె25 పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్, వి.విజయకుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ నెల 24న ఈ సాంకేతిక సదస్సు జరుగుతుందన్నారు., ఇందులో టెక్నికల్ పేపర్ ప్రెజెంటేషన్‌లు,కోడింగ్ ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్లు వర్క్‌షాపులు ఉంటాయని సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్, రాజేశేఖర్ రెడ్డి తెలిపారు.ఈ సదస్సుకు రాష్ట్రంలోని అనేక కళాశాలల నుంచి విద్యార్దులు పాల్గొంటారని ఆయన చెప్పారు.ఈ ప్రోగ్రామ్ కన్వీనర్‌గా డాక్టర్, జి.కోండారెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు.

## కుల దూషణపై డిఎస్‌పి విచారణ



కోట,ఏప్రిల్ 7 ప్రభాతవార్త : కోట మండలం వెంకన్నపాళెం పంచాయతీ పరిధిలోని వీరారెడ్డి సత్రంలో ఈ నెల 5న జయమ్మ, ఆమె కుమారుడు నరసింహాపై అదే గ్రామానికి చెందిన మస్తానయ్య కత్తితో దౌర్జన్యం చేసి కుల దూషణ చేశారని పిర్యాదు అందడంతో కోట ఎస్ఐ పవన్ కుమార్ కేసు నమోదు చేశారు. ఆమేరకు సోమవారం గూడూరు డిఎస్‌పి గీతా కుమారి వీరారెడ్డి సంత్రంకు వేల్లి వీరు వర్గాలను విచారించారు. డిఎస్‌పి గీతాకుమారి వెంట ఎస్ఐ పవన్ కుమార్‌లు ఉన్నారు.

## తెలుగుదేశంకు కోటి సభ్యత్వ నమోదు ఉన్నాయి

**- ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**



వెంకటగిరి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: ఏ పార్టీకి లేనివిధంగాతెలుగుదేశం పార్టీకి కోటి సభ్యత నమోదు ఉన్నాయని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి లోని ఆయన నివాస గృహంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయ కులకు పార్టీ పంపిన గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. పార్టీపై ఉన్న నమ్మకం అనేకమంది సభ్యత్వ నమోదు తీసుకున్నట్లు చెప్పారు. వంద రూపాయలు కట్టి పార్టీ సభ్యత నమోదు తీసుకున్న వారికి ప్రమాదవశాత్తు మరణిస్తే 5 లక్షల రూపాయలు బీమాను పార్టీ ఇస్తున్నట్లు చెప్పారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ పార్టీ కార్యకర్తల నాయకుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని బీమా పెట్టినట్లు చెప్పారు. మండల పార్టీ అధ్యక్షుడు పప్పు చంద్రమోళిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి ఏలేశ్వరం రామచంద్రనాయుడు, నాయకులు ఆనంద్, బాబు నాయుడు, విశ్వనాథం తదితరులకు పార్టీ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.

## గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలం



వెంకటగిరి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరను కల్పించడంలో విఫలమైనట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోనే ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద ఆయన విలేకరి సమావేశం నిర్వహించారు. బస్తా ధాన్యం ధర 1550 రూపాయలకు రైతులు అమ్ముకుంటున్నట్లు తెలిపారు. గత సంవత్సరం 2000 రూపాయల వరకు బస్తా ధర పలికిందని చెప్పారు. గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సంవత్సరం రోజులు కావస్తున్న సూపర్ సిక్స్ పథకాన్ని అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికల ముందు అమ్మకు వంద, వంటి అనేక పథకాల అమలు చేస్తున్నట్లు చెప్పి గాలికి వదిలేసినట్లు చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. సైదాపురం మండలంలో జరుగుతుంటే పట్టించుకోవడంలేదని విమర్శించారు. మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఒక్కడే దొరికినట్లు ఆయనపై కేసు పెట్టారని విమర్శించారు. అధికార పార్టీ వాళ్లు తెల్ల రాయి చేస్తుంటే ఎందుకు పట్టించుకోవడంలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, రూరల్ మండలం అధ్యక్షులు గోపి పాల్గొన్నారు.

## 600 కోట్లతో ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులు : ఎమ్మెల్యే



వెంకటగిరి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: సోమశిల స్వర్ణముఖి లింకు కెనాల్ డక్కిలి మండలం ఆల్తూరుపాడు గ్రామం వద్ద నిర్మించే రిజర్వాయర్ కోసం 600 కోట్ల రూపాయలతో ప్రభుత్వానికి ప్రతిపాదన పొందుతున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి లోని ఆయన నివాస గృహంలో అధికారులు రిజర్వా యర్ నిర్మాణానికి అయ్యే అంచనాల నివేదికను ఎమ్మె ల్యేకి అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆల్తురుపాడు రిజర్వాయర్ పనులు చేపట్టలేదని విమర్శించారు. గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని, ప్రాజెక్టులను విస్మరించినట్లు తెలిపారు. వెంకటగిరి,తిరుపతి, తిరుమల ,శ్రీకాళహస్తి పట్టణా లకు ఆల్తూరుపాడు రిజర్వాయర్ ద్వారా తాగునీరు అందుతుందని తెలిపారు. మే నెలలో ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన వేయిస్తామని తెలిపారు. పనులను కూడా త్వరగా పూర్తిచేసి రైతులకు మేలు చేస్తామని వివరించారు. తెలుగుగంగ ఎస్సి రాధాకృష్ణమూర్తి అధికారులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో ముద్దాయికి జైలు శిక్ష

గూడూరు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : దొంగతనం కేసులో ముద్దాయికి ఆరు నెలలు జైలు, వెయ్యి రూపాయిలు జరిమానాను మొదటి తరగతి మాజిస్ట్రేట్ పి. లోకనాథమ్ విధించారు. వివరాలు ఇలా ఉన్నాయి. గూడూరులోని తాళ్ళమ్మ గుడి వెనుక భాగంలోని బండి సుబ్రమణ్యం అనే వ్యక్తి పొలంలో ఉన్న షెడ్‌లో రాగి వైర్, పైపులు, ఐరన్ షీట్‌లు దొంగలించిన కేసులో ముద్దాయి చల్లం సీనయ్య చేసిన నేరం రుజువు కావడంతో జైలు శిక్ష విధించినట్లు మాజిస్ట్రేట్ తెలిపారు. కేసును ఏపిపి లక్ష్మీనారాయణ వాదించారు.

## డాలర్ పంట.. ట్రంప్‌తో తంటా



కోట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : రాష్ట్ర వృద్ధి రేటులో కీలక భూమిక పోషిస్తున్న ఆక్వా రంగం సంక్షోభంలో పడింది. డాలర్ల పంటగా పేరుగాంచిన ఆక్వారంగం నేడు అదే డాలర్‌తో ముడిపడిన సుంకాల సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఆక్వా ఉత్పత్తులపై రెండు మూడు శాతం ఉంటే, అమెరికా దిగుమతి సుంకం ఏకంగా 26 శాతానికి పెరగడంతో ఇక్కడ ధరలు పతనమయ్యాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వేలాది ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుంది. కోట మండల లో 1093, వాకాడు మండలంలో 1541, చిల్లకూరు మండలంలో 2756, చిట్టమూరు మండలంలో 1168 హెక్టార్లలో సాగవుతుంది. ధాన్యాగారంగా భాసిల్లుతున్న ఈ ప్రాంతం విస్తీర్ణం పరంగా ఆక్వా కంటే నాలుగు రెట్లు అధికంగా ఉన్నా, ఆర్థికంగా ఆక్వారంగానిదే పైచేయి. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిగుమతి సుంకాలను భారీగా పెంచడంతో జిల్లాలో చేతికొచ్చిన వెనామి రొయ్యలను కొనుగోలు చేసే నాథుడే కరవయ్యాడు. వారంరోజులుగా రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కాదు. చెరువుల్లో 60, 30 కౌంట్ వరకు వెనామి రొయ్యలు పట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. అయితే అమెరికా సుంకాల దెబ్బకు ధరలు పతనం కావడంతో కొనుగోలుదారులు లేక దిగాలు పడుతున్నారు.

## ప్రజలు ఆరోగ్యంపై అవగాహన కలిగివుండాలి : న్యాయమూర్తి



నాయుడుపేట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: ఆరోగ్యంపై అవగాహన కలిగివుండే విధంగా వైద్యాధికారులు గ్రామీణ ప్రజల్లో చైతన్యం తీసు కురావాలని నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి పి.సంయుక్త తెలిపారు.ప్రపంచ ఆరోగ్య ధినోత్సవం సందర్భంగా సోమవారం నాయుడు పేట పట్టణంలోని తుమ్మూరు హెల్త్‌సెంటరులో లీగల్ సర్వీస్ కమిటి ఆధ్వర్యంలో న్యాయ సదస్సు నిర్వహించారు. జూనియర్ సివిల్‌జడ్జి సంయుక్త మాట్లడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యులపాత్ర కీలకమని ఆమె తెలియజేశారు. వైద్యాధికారులు గ్రామాల్లో పర్యటించి గ్రామీణ ప్రజలకు సీజనల్ వ్యాధులు,ఆరోగ్యంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.అనంతరం జడ్జి సంయుక్తను పూలమాలలు,శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆశా చెంచుకృష్ణయ్య, న్యాయవాధి సోమశేఖర్,ఎస్సై ఆధిలక్ష్మి,తదితర న్యాయవాదులు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బడి బయట బాలలపై దృష్టి

కోట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో బడి బయట బాలల అన్వేషణ చేపట్టారు. సమగ్ర శిక్షా ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ బాలల వివరాలు సేకరిస్తున్నారు. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం గత ఏడాది డ్రాపవుట్స్ బాలలను కోట మండలంలో 25 మందిని గుర్తించి ఆయా పాఠశాలల్లో చేర్పించినట్లు ఎంఇఓ మస్తానయ్య చెప్పారు. బడి బయట పిల్లల వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు. వీటన్ని ంటినీ ప్రధానోపాధ్యాయుల లాగిన్‌లో నమోదు చేసి అక్కడి నుంచి ఎంఇఓ, డిఇఓ లాగిన్‌కు వెళతాయి. 18ఏళ్ల లోపు వయస్సు ఉన్న బాలలు అందరినీ ఏదో ఒక బడిలో చేర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, దూరప్రాంతాల్లో జీవించడం, వలస వెళ్లడం, అనాథలు, దూరవిద్య అభ్యసించడం వంటి వివరాలు నమోదు చేస్తామని తెలిపారు.

# గూడూరు డివిజన్

## అతివలకు అడిగినంత రుణం

**- డ్వాక్రా సంఘాలకు కూటమి సర్కార్ సువర్ణావకాశం**

కోట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : డ్వాక్రా సంఘాల సృష్టికర్త సీఎం నారా చంద్ర బాబు నాయుడు మహిళలకు మరో సువర్ణావకాశం కల్పిస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి వినూత్నంగా వార్షిక, ఆర్థిక జీవనోపాధి కార్యాచరణ ప్రణాళికలను సంకల్పిస్తున్నారు. డ్వాక్రా మహిళలే రుణ లక్ష్యాలను నిర్ణయించేలా ఈ సారి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. మహిళల కుటుంబాల్లోనే ఆర్థిక అవసరాలు ఏమిటి, జీవనోపాధి పెంపునకు, స్వయం ఉపాధి యూనిట్లకు ఎంత రుణం కావాలి, పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఆరోగ్య అవసరాలకు డ్వాక్రా సభ్యులే వార్షిక రుణం ఎంత ఆశిస్తున్నారో.. అన్ని ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఇప్పటికే కోట వెలుగు కార్యాలయంలో రుణ ప్రణాళికలకు ఎన్యుమరేటర్లకు, విఓఏలకు శిక్షణ ఇచ్చినట్లు ఏపిఎం అనిల చెప్పారు.

## గ్రావెల్ మాఫియాకు అడ్డాగా మారిన డివి సత్రం!

**-అసైన్డ్(సిజేఎఫ్) భూముల్లో ఎర్రమట్టి మాఫియా తవ్వకాలు**

దొరవారిసత్రం ఏప్రిల్ 7 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం ఆనేపూడి గ్రామ సమీపంలో గత కొన్ని రోజులుగా విచ్చలవిడిగా కొనసాగుతున్న అక్రమ ఎర్రమట్టి తవ్వకాలు. గ్రామాలలోని దళిత అసైన్డ్‌భూములను లక్ష్యంగా చేసుకుని వారికి డబ్బు ఆశ చూపి పచ్చని పంట పొలాలను తవ్వేసి రియలస్టేటు ప్లాటులకు,పక్క రాష్ట్రాలకు తరలించి కోట్ల రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. వీరు చేసే అక్రమ వ్యాపారానికి ఎవ్వరు అడ్డువచ్చిన అధికార అండతో వారిపై బెదిరింపులకు గురిచేస్తున్నారు. దొరవారిసత్రం మండల పరిధిలోని పూలతోట,ఆనేపూడి తదితర ప్రాంతాలలో దళితులకు ఇచ్చిన పంట పొలాల్లో హిటాచీలను వాడి లోతైన గుంటలు తవ్వి గ్రావెల్‌ను టిప్పర్ల సహాయంతో సూళ్లూరుపేట,తడ, శ్రీసిటీ కంపెనీలకు,పక్క రాష్ట్రాలకు తరలించి కోట్ల రూపాయలు సొమ్ముచేసుకుంటున్నారు.

## ఇసుక ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి

నాయుడుపేట,ఏప్రిల్ 7 ప్రభాతవార్త: మండలం తుమ్మూరు సమీపంలో ఇసుక ట్రాక్టర్ ఢీ కొని ఈగ పుల్లయ్య(26)అనే యువకుడు ఆధివారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల సమాచ్చారం మెరకు వివరాలిలా ఉన్నాయి. మండలం అయ్యప్పరెడ్డిపాళెం గ్రామానికి చెందిన పుల్లయ్య మోటార్ సైకిల్‌పై నాయుడు పేటకు వస్తుండగా మార్గమధ్యలో తుమ్మూరు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ ప్రమాదవశాత్తు మోటార్‌సైకిల్‌ను ఢీ కొంది. దీంతో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న పుల్లయ్య తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి క్షతగాత్రుడుని 108సహాయంతో చికిత్సనిమిత్తం నాయుడు పేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యంకోసం గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పుల్లయ్య మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాయుడుపేట సిఐ బాబి ఇసుక ట్రాక్టరును పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం



తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా అదనపు ఎస్పీలు రవి మనోహరా చారి జిల్లా నలుమూలల నుండి సోమవారం నాడు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ కె. రవిమనో హరాచారి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. వికలాంగులు, వృద్ధులు, మహిళల సమస్యలను సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. 121 ఫిర్యాదులు వచ్చింది. వాటిని సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కార మార్గం చూపవలసిందిగా ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంల సిఐలు సాధిక్ అలీ ఎస్సై, శరత్ కుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఇమ్రాన్ భాష, శ్రీరాములు, బాబి, హుస్సేన్ భాష, మురళి, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుల పరిష్కార వేదికకు 34 వినతులు



తిరుపతి కార్పొరేషన్,ఏప్రిల్ 7 ప్రభాతవార్త : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 59 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా 8 మంది తమ సమస్యలు తెలుపగా, 26 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. కాగా శాప్ చైర్మన్ రవి నాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్.సి. మునికృష్ణ, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మలు విచ్చేసి టిడిఆర్ బాండ్ల అవకతవకలకు పాల్పడిన వారిపై విచారణ జరపాలని, ఇవ్వాల్సిన వారికి పారదర్శకంగా అందజేయాలని కమిషనర్‌ను కోరారు. వేశాలమ్మ గుడి వద్ద సీసీ రోడ్డు ఏర్పాటు చేయాల ని కార్పొరేటర్ నరసింహ ఆచారి కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎల్.బి.నగర్ నందు ఆక్రమిత స్థలంలో మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ వినియోగిస్తున్నారు. పరిష్కరించాలని, సంజీవయ్య నగర్ లో రాకపోకల మార్గం ఆక్రమించారని, ఆస్తిపన్ను అధికంగా వస్తోంది తగ్గించాలని, అమెరికా బార్ వద్ద వివిధ కంపెనీల వానలు రోడ్డుపై నిలబెట్టడంతో ట్రాఫిక్ ఇబ్బందులు పరిష్కరించాలని, భూగర్భ డ్రైనేజీ కాలువల లీకేజి అరికట్టాలని, ప్రభుత్వ ఇళ్లు ఇప్పించాలని, జర్నలిస్ట్ కల్యాణిలో చెట్టు కొమ్మల వలన రాకపోకలకు ఇబ్బంది ఉందని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, పలు ప్రాంతాలలో సిసి రోడ్లు వేయాలని, చెరువులు ఆక్రమణకు గురి కాకుండా పరిరక్షించాలని, విశ్వ సాయి విద్యాలయం వద్ద రాకపోకలకు ఇబ్బంది ఉంది తొలగించాలని కోరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డి.ఈ.లు, ఏసిపి లు, తదితరులు ఉన్నారు.

## గణనాధుని సన్నిధిలో సినీ దర్శకుడు



కాణిపాకం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: సినీ దర్శకుడు మారుతి సోమవారం సతీసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజీనాయుడు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారికి వేదమంపడపంలో వేదపండి తులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

## చంద్రమౌళీశ్వరస్వామిని తాకిన సూర్య కిరణాలు



కల్లూరు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : శ్రీ చంద్రమోళీశ్వర స్వామి ఆలయంలో ఒక అపూర్వ, అద్భుత దైవ లీల. ఆవిష్కరించింది. పులిచెర్ల మండలం కల్లూరు శ్రీ చంద్రమోళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు రామచంద్రరావు స్వామివారికి అభిషేకం నిర్వహించి అలంకారం చేస్తుండగా సూర్యకిరణాలు స్వామి వారి పాదాలకు ప్రసరించడంతో అర్చకులు ఆశ్చర్యంతో భక్తి భావంతో పులకించి పోయారు. సాక్షాత్తుస్వామి వారు పాదాలకు ఆ సూర్య భగవానుడు కిరణాలు తాకడం గొప్ప విశేషమని భక్తులు భావిస్తున్నారు.

## శ్రీసిటీలో కంటైనర్ లారీ బోల్తా

సత్యవేడు,ఏప్రిల్7 ప్రభాతవార్త: సత్యవేడు మండల పరిధిలోని శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న కోబెల్కో సర్కిల్ వద్ద లాంగ్ ఫిట్ కంటైనర్ లారీ ఓవర్ స్పీడ్‌లో రావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. సమా చారం అందుకున్న శ్రీసిటీ సెక్యూరిటీ సిబ్బంది సంఘటనా స్థలం చేరుకుని బారి గేడ్లు ఏర్పాటు చేసివాహనాలు రాకపోకలకు ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు. వాహనం బోల్తా పడడానికి కారణం డ్రైవర్ ఓవర్ స్పీడ్ అని వారు అభిప్రాయపడు తున్నారు.

## రామయ్య కల్యాణం జగతికి శుభదాయకం



తిరుపతి(రవాణ),ఏప్రిల్ 7ప్రభాతవార్త: తిరుపతిలోని కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి సీతా శ్రీరామ చంద్రమూర్తుల కల్యాణఘట్టం నిర్వహిం చారు. ఆలయం ప్రాంగణంలో పచ్చని తోరణాల మధ్య ముత్యాలతలంబ్రాలుతో ఈ కల్యాణ వేడుక జరిపారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా వేదపారాయణం చేయగా మంగళవాయిద్యాల నడుమ తంతు ముగిసింది. అంతకుముందు సోమవారం ఉదయం కోదండరామస్వామి కల్యాణానికి అవసరమైన ముత్యాల తలంబ్రాలను తిరుపతి టిటిడి పరిపాలన భవనం నుండి ఏనుగులపై,అంబారీలపై ఊరేగింపుగా ఆలయానికి చేర్చారు. ముత్యాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోదండరాముని కల్యాణంలో ముత్యాలతలంబ్రాలకు ఎంతో విశిష్టత ఉండటంతో దీన్ని వినియోగించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయం్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేశ్ భక్తులు పాల్గొన్నారు

## కోడలపై... మామ దాడి !

పూతలపట్టు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : పూతలపట్టు మండలం పాటూరు నందు జయ చంద్ర నాయుడు భార్య కుసుమ పై మామ రీతాక్షి నాయుడు అమానుషంగా దాడి చేయడం జరిగినది. కుసుమ తల్లిదండ్రులకు ఒక గాను ఒక కూతురు తల్లితండ్రుల ఆలన పాలన చూసుకుంటుందని కుసుమ తల్లిదండ్రులు తమ ఇంటికి రాకూడదని తన తండ్రి ఆస్తి అమ్మి డబ్బులు తీసుకురావాలని నిత్యం మామ రితాక్షి నాయుడు అతని కుమార్తె ప్రమీల అతని బామరిది భాస్కర్ నాయుడు వేధింపులకు గురి చేయడం జరుగుతున్నది. కుమారుడు జయచంద్ర నాయుడు లేని సమయం చూసి తన కోడలు కుసుమపై కర్ర, రాయితో డబ్బులు తీసుకురావాలని విచక్షణ రహితంగా దాడి చేయడం నీటి సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉన్నది. రీతాక్షి నాయుడు రిటైర్డ్ ఉద్యోగి కావడం గమనార్హం. మారుతున్న నేటి సమాజంలో ఆడపిల్లలకు రక్షణ లేకపోవడం అత్తింటి వేధింపులు ఎక్కువ అవడం సర్వ సాధారణంగా మారిపోయాయి బాధ్యతరాహిత్యంగా దాడి చేసిన రీతాక్షి నాయుడు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మరో అబలకు ఎలాంటి కష్టం రాకూడదని పాటూరు గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోడలు పై దాడి సమర్థిస్తూ రీతాక్షి నాయుడుకు అధికార పార్టీ నాయకులు కొంతమంది వెన్నుండి నిలవడం బాధిత మహిళపై కనీస జాలి కనికరం చూపకుండా దాడి చేసిన రీతాక్షి నాయుడు కు ధన బలం ఉందని అతని వెనకాల అధికార పార్టీ నాయకులు బాధిత మహిళకు న్యాయం జరగకుండా తప్పు దోవ పట్టిస్తున్నారు. నాకు అన్యాయం జరిగింది. న్యాయం చేయండి అని బాధ్యత మహిళ కుసుమ పూతలపట్టు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదుల స్వీకరించి విచారించి తన మామ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరిన తన మామ రితాక్షి నాయుడు కు ఉన్న ధన బలం అధికార పార్టీ నాయకుల బలం ఉండడంతో చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు కూడా రితాక్షి నాయుడుకు మద్దతు ఇవ్వడం దాడి చేయడమే కాకుండా తిరిగి బాధితురాలు కుసుమ భర్త జయచంద్ర నాయుడు పై తప్పుడు కేసులు బనాయించి నా ఆ ఫిర్యాదును పోలీసులు స్వీకరించి ఎఫ్ఐఆర్ కట్టడం చోద్యమని సభ్య సమాజం తలదించుకునేలా ఉందని పాటూరు గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ద్రవిడ వర్సిటీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం..?

కుప్పం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : ద్రవిడ విశ్వవిద్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న వాటర్‌మెన్ రమేష్ అనే వ్యక్తి ఆదివారం రాత్రి ద్రవిడ వర్సిటీ ప్రాంగణంలో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇది గమనించిన వర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది విషయాన్ని వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయడంతో వారు గుడుపల్లె పోలీసులకు తెలపడంతో ఎస్సై, పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని రమేష్‌ను వారించి ఇంటికి పంపేసినట్లు సమాచారం. సోమవారం సైతం రమేష్ కదిలికలపై వర్సిటీలో నిఘా ఉంచారని తెలిసింది. కాగా సోమవారం ద్రవిడ వర్సిటీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ వేతనాల విషయంగా వర్సిటీ ఉన్నతాధికారులను కలసినట్లు తెలిసింది. వర్సిటీ అధికారులు మాట్లాడుతూ తాము తాత్కాలిక ఉద్యోగులకు జీతాలు మంజూరయ్యే విధంగా తమవంతు కృషి చేస్తున్నామని పేర్కొన్నట్లు సమాచారం.

## రామచంద్రారెడ్డికి జాతీయస్థాయిలో ఉత్తమ ప్రశంసాపత్రం



చిత్తూరురూరల్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: జాతీయస్థాయిలో విజయవాడ నందు ఒక్కరోజు జరిగిన ఆర్ట్‌ఫెస్ట్ క్యాంపులో చిత్తూరు జిల్లా బాలభవన్ పర్యవేక్షకులు కె.రామచంద్రారెడ్డి ప్రకృతిని మనమే కాపాడుకుందాం అనే అంశంపై స్పాట్ పెయింటింగ్‌లో ఉత్తమ ప్రశాంసాపత్రం అందుకొన్నారు. ఈ ప్రశంసాపత్రం. మెమెంటోలను డైరెక్టర్ స్కూల్ ఆఫ్ పెయింటింగ్ అండ్ ఆర్కిటెక్టర్ రమేష్‌కొండా, కమీషనర్ ఆఫ్ పోలీస్ ఎస్‌వి రాజేంద్రబాబు చేతుల మీదుగా అందుకోవడం చాలా ఆనందంగా వుందని రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. కాగా అవార్డు అందుకొన్న రామచంద్రారెడ్డికి జిల్లా విద్యాశాఖ అధికారులు తదితరులు అభినందనలు తెలిపారు.

## వడదెబ్బ చర్యల పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

చిత్తూరు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ వడదెబ్బ, వడగాల్పులపై ముందస్తు జాగ్రత్త చర్యల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ వేసవి ప్రారంభం కావడంతో ఎండలు క్రమేపి పెరుగుతున్న పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. 10 సంవత్సరాలలోపు పిల్లలు, వృద్ధులు, బాలింతలు, గర్భవతులు జాగ్రత్తగా వుండాలన్నారు. వేసవి కావడంతో విద్యార్థులకు ప్రభుత్వం ఒంటిపూట పాఠశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థులు ఇంటి నుండి బయటికి వెళ్ళరాదని, ఇంట్లోనే వుండాలన్నారు. ఎండలో బయటికి వెళ్ళి ఆట్లాడటం వల్ల విద్యార్థులకు వడదెబ్బ తగిలే అవకాశం వుందన్నారు. వడదెబ్బకు గురైన వారికి ఎక్కువగా జ్వరం, తలనొప్పి, నీరసం, కళ్ళు తిరగడం, విరేచనాలు, వాంతులు, నోరు ఆరిపోవడం, అపస్మారక స్థితికి వెళ్ళడం వంటి లక్షణాలు వుంటాయన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే చల్లటి, నీడ వున్న ప్రదేశంలోకి తీసుకెళ్ళాలని, మెలకువగా వుంటే ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఓఆర్ఎస్ ద్రావణంను తాగించాలన్నారు. ముఖంను చల్లటి నీటితో కడగాలని, గాలి బాగా వచ్చే విధంగా ఫ్యాను కింద వుండాలన్నారు. 108కి ఫోన్ చేసి సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని, ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరం అయితే తప్ప ఇంటి నుండి వెళ్ళరాదన్నారు.



తడ మండలం, వాటంబేడులోని ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తదితరులు

- ప్రభాతవార్త, తడ